నవతెలంగాణ

ఆదిలాబాద్

శుక్రవారం | జూన్ 07, 2024 | www.navatelangana.com

1

ప్రాజెక్టును సందర్శించిన సీఈ

నవతెలంగాణ-కడెం

కడెం ప్రాజెక్టును సీఈ టి.శ్రీనివాస్ గురువారం మధ్యాహ్నం సందర్శించారు. ఎస్ఈ రవీందర్, ఈఈ విఠల్‌తో కలిసి ప్రాజెక్టు మరమ్మత్తు పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ప్రాజెక్టు వరద గేట్ల ట్రయల్ రన్ చేసి గేట్ల లిఫ్టింగ్ స్థితిగతులను పరిశీలించారు. జూన్ మాసంలో వర్షాలు పడనున్న నేపథ్యంలో ప్రాజెక్టు మరమ్మత్తు పనులను త్వరితగతిన పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. నాణ్యత ప్రమాణాలను ఎప్పటికప్పుడు పాటించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రాజెక్టు డీఈ భోజదాస్, ఏఈఈ రవినాయక్, ప్రాజెక్ట్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



ప్రజల సమస్యల పరిష్కారానికి కృషి

సారంగాపూర్ : ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని కాంగ్రెస్ సీనియర్ నాయకులు అల్లూరి మల్లారెడ్డి అన్నారు. గురువారం మండలంలోని పెండల్‌ధరి, ఇప్పచెల్మ ఆదివాసీ గోండు గూడాల్లో సమస్యలను అడిగి తెలుసుకున్నారు. తాగు నీటి సమస్యకు వెంటనే సంబంధిత అధికారులకు ఫోన్ ద్వారా తెలిపి సమస్య పరిష్కారానికి కృషి చేశారు. పోడు భూముల్లో విద్యుత్ సమస్య, రోడ్లు, ఇండ్ల నిర్మాణం వంటి సమస్యలను ఇన్‌చార్జి మంత్రి సీతక్క దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు. అనంతరం ఇప్పచెల్మ గ్రామంలో ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన సుదర్శన్(40) కుటుంబాన్ని పరామర్శించారు. కార్యక్రమంలో జిల్లా కిసాన్ సెల్ వర్కింగ్ ప్రెసిడెంట్ అట్ల పోతారెడ్డి, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు గంగాధర్, ఎస్టీ సెల్ మండల అధ్యక్షులు భీంరావు, భోజన్న పాల్గొన్నారు.



మండలంలో విత్తనాల కొరత లేదు

నవతెలంగాణ-సిరికొండ

మండలంలో పత్తి విత్తనాల కొరత లేదని జిల్లా వ్యవసాయ అధికారి పుల్లయ్య ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రైతులు వారికి కావాల్సిన విత్తనాలు కొనుగోలు చేస్తున్నారని వివరించారు. రైతుల కోసం 7300 పత్తి విత్తనాలు అందుబాటులో ఉన్నాయని, సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

నాణ్యత ప్రమాణాలతో పనులు పూర్తి చేయాలి

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

అమ్మ ఆదర్శ పాఠశాలలో చేపట్టే పనులు నాణ్యత ప్రమాణాలతో కూడుకొని ఉండాలని, పాఠశాలల్లో చేపడుతున్న పనులన్నింటినీ ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ వేగవంతంగా పూర్తి చేయాలని కలెక్టర్ రాజర్షి షా సంబంధిత అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్ లో అమ్మ ఆదర్శ పాఠశాల పనులు, స్కూల్ యూనిఫాం తయారీ తదితర అంశాలపై సంబంధిత అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో అమ్మ ఆదర్శ పాఠశాలలో మౌలిక వసతుల కల్పనలో భాగంగా ప్రభుత్వ పాఠశాలలో చేపడుతున్న తాగునీరు, టాయిలెట్స్, మైనర్ మేజర్ రిపేర్స్, బాలికల కోసం ఏర్పాటు చేసిన టాయిలెట్స్, విద్యుత్ వంటి పనులను ఇప్పటివరకు ఎన్ని పూర్తయ్యాయి, ఇంకా ఎన్ని పనులు చేపట్టాల్సి ఉంది, ఎప్పటిలోగా పూర్తి చేస్తారని సంబంధిత అధికారులు అడిగి తెలుసుకున్నారు. ప్రణాళికలు రూపొందించుకొని యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలని కోరారు. ప్రభుత్వ పాఠశాలలో సమూలమైన మార్పులు తెచ్చేందుకు చేపట్టిన అమ్మ ఆదర్శ పాఠశాలల పనులను లక్ష్యంగా నిర్దేశించుకుని స్కూల్ తెరచే లోపు పూర్తి చేయాలన్నారు. పనులు పూర్తయిన ఫొటోలు పంపాలన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు యూనిఫామ్స్‌ను పాఠశాలల పున:ప్రారంభం కావడానికి ముందే అందించేలా ప్రణాళికాబద్ధంగా వ్యవహరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. నిర్ణీత గడువులోగా యూనిఫామ్స్ తయారీ ప్రక్రియ పూర్తయ్యేలా చూడాలన్నారు. సమావేశంలో విద్యాశాఖ అధికారి ప్రణీత, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు, డివిజనల్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు, అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు పాల్గొన్నారు.

చంద్ర రాజేశ్వరరావు ఆశయ సాధనకు కృషి చేయాలి

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

భూ పోరాట యోధుడు, సీపీఐ అగ్రనాయకులు దివంగత చంద్ర రాజేశ్వరరావు ఆశయ సాధనకు కృషి చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి ముడుపు ప్రభాకర్‌రెడ్డి అన్నారు. గురువారం పార్టీ కార్యాలయంలో ఆయన 111వ జయంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ పేదలు, అణగారిన వర్గాల కోసం ఎర్రజెండాను చేతబూని తన ఆస్తిని పేదలకు పంపిణీ చేసిన మహనీయుడు రాజేశ్వర్‌రావు అని కొనియాడారు. భూసామ్య కుటుంబంలో పుట్టిన ఆయన కృష్ణ జిల్లాలో తన ఆస్తులను పేదలకు అందించారన్నారు. అప్పటి నుంచి భూ పోరాటంతో పాటు తెలంగాణ సాయుధ పోరాటంలో కూడా పాల్గొన్నారని తెలిపారు. 26సంవత్సరాల పాటు సీపీఐకి జాతీయ ప్రధాన కార్యదర్శిగా కూడా పని చేశారన్నారు. ఆయన ఆశయ సాధన దిశగా ప్రతి కార్యకర్త పని చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు నళినిరెడ్డి, అరుణ్‌కుమార్, కుంటాల రాములు పాల్గొన్నారు.

రూ.4.40లక్షల గుట్కా పట్టివేత



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

రాష్ట్ర ప్రభుత్వం నిషేధించిన గుట్కాను విక్రయించిన, నిల్వ చేసిన చర్యలు తీసుకుంటామని డీఎస్పీ జీవన్‌రెడ్డి స్పష్టం చేశారు. పట్టణంలోని డాల్డా కంపెనీ కాలనీలో గుట్కా కల్తీ చేస్తున్న వ్యక్తిని పట్టుకున్నారు. గురువారం టూటౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో సీఐ అశోక్‌తో కలిసి వివరాలు వెల్లడించారు. ఈ సందర్భంగా డీఎస్పీ జీవన్‌రెడ్డి మాట్లాడుతూ నిషేధిత గుట్కా ఎవరు విక్రయించిన, నిల్వచేసిన చట్ట పరంగా చర్యలు తీసుకుంటామన్నారు. వారం రోజుల వ్యవధిలో 20లక్షల గుట్కాను పట్టుకున్నామని తెలిపారు. తనిఖీల క్రమంలో సమాచారం మేరకు టూ టౌన్ పోలీసులు డాల్డా కంపెనీలో దాడులు నిర్వహించి మహారాష్ట్రకు చెందిన మజా కంపెనీ తంబాకులో కల్తీ చేస్తున్నట్లు గుర్తించారన్నారు. అక్కడి మిషన్‌ను గుట్కా డబ్బాలను స్వాధీనం చేసుకోగా వర్కర్ ఇర్ఫాన్‌ను అరెస్టు చేశారని తెలిపారు. సీఐ అశోక్ మాట్లాడుతూ మిషన్ ద్వారా మజా కంపెనీ డబ్బాల్లో తంబాకును కల్తీ చేస్తున్నట్లు గుర్తించామన్నారు. ఇర్ఫాన్‌ను అదుపులోకి తీసుకొని విచారించగా సోను ట్రేడర్స్ యాజమని రిజ్వాన్‌తో కలిసి కల్తీ చేస్తున్నట్లు తెలిందన్నారు. పట్టుకున్న తంబాకు విలువ 4లక్షల40వేల వరకు ఉంటుందని వెల్లడించారు. రిజ్వాన్ పరారీలో ఉన్నట్లు తెలిపారు.

పుట్టిన రోజు ఖర్చుతో విద్యార్థులకు బస్‌షెల్టర్



నవతెలంగాణ-బోథ్

పుట్టిన రోజు అనవసర ఖర్చు వద్దనుకొని ప్రజా అవసరాలకు ఖర్చు చేయాలని భావించిన మండల కేంద్రానికి చెందిన మాసం లక్ష్మీ వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షుడు డా.మాసం అనిల్‌కుమార్ ఆదర్శ, కస్తూరిబా విద్యార్థుల కోసం బస్‌షెల్టర్‌ను ఏర్పాటు చేశారు. స్థానిక రాఘవేంద్ర జిన్నింగ్ సమీపంలోని ఆదర్శ, కేజీబీవీ పాఠశాలల విద్యార్థులకు బస్సు షెల్టర్ లేక చాలా ఇబ్బంది పడుతున్నారని గమనించి అనిల్ కుమార్ అన్న మాసం కిరణ్ జ్ఞాపకార్థం బస్ షెల్టర్ నిర్మించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి పుట్టిన రోజు ఏదో ఒక సామాజిక సేవ చేస్తున్నానని తెలిపారు. ఈ ఏడాది అన్నయ్య మాసం కిరణ్ జ్ఞాపకార్థం బస్ షెల్టర్ నిర్మించామన్నారు. పుట్టిన రోజులు జరుపుకునే వారు పార్టీలు అని డబ్బు వృథా చేయకుండా సామాజిక సేవా కార్యక్రమాలు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో దుర్గ కమిటీ అధ్యక్షుడు పాలిక్ రమేష్, విద్యార్థి సంఘం అధ్యక్షుడు పుండ్రు రాకేష్‌రెడ్డి, నాయకులు మెరుగు సాయి, వోటకరి సాయి, రోహిత్, చాట్ల రాము, మాసం అరవింద్, వినీల్ ఇప్ప, ముత్యం, సన్నీ, ఆలంబన వెల్ఫేర్ సొసైటీ సభ్యులు పాల్గొన్నారు.

అప్పులు తీసుకుంటుండ్రు..చేతులు లేపేస్తుండ్రు..!

- ఈజీ మనీ కోసం కొందరు వ్యాపారుల తండ్లాట
- కాగజ్‌నగర్‌లో పెరుగుతున్న ఆర్థిక నేరాలు
- ఇతర వ్యాపారులపై దీని ప్రభావం

కాగజ్‌నగర్ పట్టణం బాలాజీనగర్ ఏరియాకు చెందిన ఒక ప్రయివేట్ ఫైనాన్స్ వ్యాపారి రూ.8కోట్ల వరకు అప్పు చేసి రెండు నెలల క్రితం పరారయ్యాడు. ఇతను ఫైనాన్స్ వ్యాపారం చేస్తూనే అదే సమయంలో ప్రయివేట్‌గా చిట్టీలు నడుపుతున్నాడు. ఇతనికి ఇచ్చే వారు డబ్బులు ఇవ్వకపోవడం, ఇతని వద్ద చిట్టీ లేపుకున్న వారు డబ్బుల కోసం ఒత్తిళ్లు చేయడంతో ఏం చేయాలో పాలుపోక పరారైనట్లు తెలిసింది. ఇటీవలే ఈ వ్యాపారి కాగజ్‌నగర్‌కు వచ్చినా తనకు ఇచ్చే వారు డబ్బులు ఇస్తేనే తానిచ్చే వారికి చెల్లిస్తానని మొండికేస్తున్నట్లు తెలుస్తోంది. ఇప్పటికే ఈ వ్యాపారిపై చెక్ బౌన్స్ కేసు నడుస్తోంది.

స్థానిక ఆదర్శనగర్‌కు చెందిన మరో వ్యాపారిది కూడా ఇదే తంతు. రూ. 4 కోట్ల వరకు అప్పులు చేసి మొండికేస్తున్నట్లు విశ్వసనీయ సమాచారం. మద్యం వ్యాపారంలో భాగస్వామి అయిన ఇతను కాగజ్‌నగర్ మండలం ఈజ్‌గాంలో అనధికారికంగా పేకాట క్లబ్ కూడా నడుపుతుంటాడని తెలుస్తోంది. మద్యం టెండర్లలో పాల్గొని డబ్బులు పోగొట్టుకోవడం, కర్ణాటకలో గుప్త నిధుల తవ్వకాల ముఠాతో కలిసి పెట్టుబడులు పెట్టడం తదితర కారణాలతో అప్పుల పాలైనట్లు తెలిసింది. ప్రస్తుతం ఈ వ్యాపారి స్థానికంగానే ఉన్నా డబ్బులు చెల్లించే విషయంలో మొండికేస్తున్నట్లు తెలుస్తోంది.

స్థానిక సీతాపతిరోడ్‌కు చెందిన ఒక వ్యక్తి రూ. 10 కోట్ల వరకు అప్పులు చేశాడు. మార్కెట్‌లో ఒక బ్యాంక్‌కు సంబంధించిన సర్వీసు సెంటర్ నడిపే ఈ వ్యక్తికి ఇంత పెద్ద మొత్తంలో అప్పులు ఎలా పుట్టాయన్నదే ఇక్కడ అర్థం కాని ప్రశ్న. కోటి రూపాయల వరకు అప్పులు ఇచ్చిన ఒక వ్యక్తి ఇటీవలే అతని ఇంటిని రిజిష్ట్రేషన్ చేయించుకున్నట్లు విశ్వసనీయ సమాచారం. తనకు అప్పులు పెరిగాయని, తనకు ఆత్మహత్యే శరణ్యమంటూ ఒక వీడియోలో ఇతను మాట్లాడిన మాటలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి.

నవతెలంగాణ-కాగజ్‌నగర్

ఇవి చాలు కాగజ్‌నగర్‌లో ఆర్థిక నేరాల విచ్చలవిడి ఎలా ఉందో చెప్పడానికి. ఒకట్రెండు నెలల నుండి జరుగుతున్న తంతు కాదిది. కొన్నేళ్ల నుండి ఈ తంతు జరుగుతోంది. కొంతమంది వ్యాపారులు ఈజీ మనీ కోసం అప్పులు చేస్తూ విలాస జీవితాన్ని అనుభవిస్తూ ఇతరుల జీవితాలతో ఆటలాడుకుంటున్నారు. అప్పులు చేసి తీసుకొచ్చిన డబ్బులతో విలాసవంతమైన భవనాలు నిర్మించుకోవడం, జల్సాలకు అలవాటు పడడం చేస్తున్నారు. మనీ రొటేషన్ చేస్తున్నామని, మీ డబ్బులను వడ్డీతో సహా చెల్లిస్తామని నమ్మకం కలిగిస్తుండడంతో అప్పులు ఇచ్చే వారు కూడా వారి మాటలు నమ్మి లక్షల రూపాయలు ఇస్తున్నారు. తీరా పీకల మీదికి వచ్చేసరికి అప్పులు తీసుకున్నవారు చేతులు లేపేస్తుండడంతో ఇచ్చిన వారు బయటకు చెప్పుకోలేక సతమతమవుతున్నారు. పైన చెప్పిన దానిలో ఒక వ్యాపారి ప్రైవేట్ చిట్టీలు నడిపే వారి వద్ద 31 చిట్టీలు వేశాడు. ఈ చిట్టీలన్నీ లేపుకున్నాడు. ఈ వ్యాపారి ప్రతీ నెలా చిట్టీల వ్యాపారులకు రూ.18 లక్షలు చెల్లించాల్సి ఉంది. ప్రస్తుతం ఆ వ్యాపారి చేతులు లేపడంతో ఆ చిట్టీల వ్యాపారుల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. ప్రైవేట్ చిట్టీ వ్యాపారులు కావడంతో అటు పోలీసుస్టేషన్‌కు వెళ్లలేక, ఇటు డబ్బులు రాక సతమతమవుతున్నారు.

ఒక్కొక్కరి నుండి రూ. 30 లక్షలపైనే అప్పులు

చేతులు లేపేసిన సదరు వ్యాపారులకు కోట్లలో అప్పులు ఉన్నాయి. వీరు ఒక్కొక్కరి నుండి రూ. 30 లక్షలపైనే అప్పులు చేశారు. అది కూడా కేవలం నమ్మకంపైనే. నామమాత్రంగా బాండ్ పేపర్ రాసుకుంటున్నారు. డబ్బులు తీసుకున్న వారు చేతులు లేపితే చేసేదేమీ లేదు. ఎందుకంటే రూ. 30 లక్షల అప్పిచ్చిన సదరు వ్యక్తికి ఆ రూ. 30 లక్షలు ఎక్కడినుండి వచ్చాయనే లెక్కలు చూపించాల్సి ఉంటుంది. అప్పులు ఇచ్చే వారి వద్ద ఎక్కువగా బ్లాక్ మనీనే ఉంటుంది. మరి ఈ డబ్బులు ఎగ్గొట్టేవారి నుండి అధికారికంగా డబ్బులు రాబట్టుకునే వీలు లేదు.

విచ్చలవిడిగా ప్రయివేట్ ఫైనాన్స్‌లు

కాగజ్‌నగర్‌లో ప్రయివేట్ ఫైనాన్స్‌లు విచ్చలవిడిగా కొనసాగుతున్నాయి. 3 శాతం నుండి 5 శాతం వరకు వడ్డీలు తీసుకుంటూ అప్పులు ఇస్తున్నారు. కొంతమంది వ్యాపారులు రూ.30లక్షలు వడ్డీకి ఇచ్చి ప్రతి రోజు లక్ష వసూలు చేస్తారు. అప్పు తీసుకున్న వ్యక్తి 31 రోజుల పాటు రూ.31 లక్షలు చెల్లిస్తాడు. అంటే నెలకు రూ.లక్ష వడ్డీ రూపేణా వసూలవుతోంది. ఇటీవల చేతులు లేపిన వ్యాపారులు ఈ విధంగానే అప్పులు తీసుకొని ఇప్పుడు చేతులు లేపినట్లు తెలుస్తోంది.

ఇతర వ్యాపారులపై ప్రభావం



గత నెలలో ప్రయివేట్ ఫైనాన్స్ నిర్వాహకుడి ఇంట్లో దొరికిన పత్రాలు పరిశీలిస్తున్న ఎస్పీ, పోలీస్ అధికారులు(ఫైల్)

దీని ప్రభావం ఇతర వ్యాపారులపై పడుతోంది. ఉదాహరణకు ప్రయివేట్ చిట్టీలు నడిపేవారి సంఖ్య కాగజ్‌నగర్‌లో అధికంగా ఉంది. ఇప్పుడు చేతులు లేపిన వ్యాపారులు ప్రతి నెలా చిట్టీలు కట్టాల్సి ఉంది. ఈ వ్యాపారుల నుండి ఇప్పుడు చిట్టీ డబ్బులు వసూలయ్యే పరిస్థితి లేదు. దీంతో చిట్టీలు నడిపే వారు అయోమయంలో పడ్డారు. ఇటు వీరి నుండి చిట్టీ డబ్బులు వసూలు కాక, అటు చిట్టీలు లేపుకున్న వారికి సకాలంలో చెల్లించలేక వారు ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారు. ఈ ఇబ్బందులు తట్టుకోలేని మరో నలుగురు వ్యాపారులు కూడా చేతులు లేపే పరిస్థితి ఉన్నట్లు తెలుస్తోంది.

ఫిర్యాదులు రాలేదు : శంకరయ్య, సీఐ

ఆర్థిక నేరాలపై మాకు ఎలాంటి ఫిర్యాదులు రాలేదు. వస్తే చర్యలు తీసుకుంటాం. వీటిని నిరోధించడానికి కఠిన చర్యలు తీసుకోవాల్సిన అవసరముంది.

పిడుగుపాటుకు ముగ్గురు మృతి

నవతెలంగాణ-ఇంద్రవెల్లి, నిర్మల్

పిడుగుపడి ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో ముగ్గురు మృతి చెందారు. ఇంద్రవెల్లి మండలం డోంగ్రగావ్‌కు చెందిన భార్యాభర్తలు ఆనక సంతోష్, స్వప్న మృతి చెందారు. పొలంలో పని చేస్తూ వర్షం రావడంతో అక్కడే ఉన్న గుడిసెలోకి వెళ్లారు. గుడిసెపై పిడుగుపడడంతో మృతి చెందారు. కుటుంబ సభ్యులు వెళ్లి చూడగా విగత జీవులుగా పడి ఉన్నారు. తోటలోకి పని నిమిత్తం వెళ్లిన వ్యక్తి పిడుగుపాటుకు గురై మృతి చెందిన ఘటన దిలావర్‌పూర్ మండలం కాల్వ గ్రామంలో జరిగింది. రైతు మూడపల్లి ప్రవీణ్(28) తోటలోకి వెళ్లాడు. పని చేస్తుండగా ఉరుములతో కూడిన వర్షం మొదలైంది. ఒక్కసారిగా పిడుగు పడడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. యువకుని మృతితో కుటుంబం శోకసంద్రంలో మునిగింది. మృతుడికి భార్య, సంవత్సరం కూతురు ఉన్నారు.



ప్రవీణ్(ఫైల్)

తలమడుగు : మండలంలో గురువారం మధ్యాహ్నం ఉరుములు, మెరుపులతో కుడిన వర్షంతో పాటు పిడుగు పడి ఎద్దు మృత్యువాత పడింది. భరంపూర్ గ్రామానికి చెందిన రైతు సంపత్ రామన్న గురువారం ఉదయం చేను పని ముగించుకొని ఎండ ఉండడంతో రెండు ఎద్దులను చెట్టు కింద కట్టేశాడు. మధ్యాహ్నం వర్షంతో పాటు పిడుగు పడడంతో రూ.50వేల విలువ గల ఎద్దు మృతి చెందింది. మరో ఎద్దు గాయపడడంతో చికిత్స అందిస్తున్నారు. సమాచారం అందించిన వెంటనే పశువైద్యాధికారి దూద్‌రాం సంఘటన స్థలాన్ని చేరుకొని గాయపడ్డ ఎద్దుకు చికిత్స అందించారు. ఎద్దు మృతితో నష్టపోయిన తనకు ఆర్థిక సాయం అందించాలని రైతు కోరుతున్నాడు.

కడెం : పిడుగుపాటుతో ఐదు మేకలు, ఒక గొర్రె మృతి చెందింది. మండలంలోని అంబారిపేట్‌కు చెందిన జింక వెంకటేష్ రోజులాగే తన మేకల మందను మేపడానికి గ్రామ సమీపానికి తీసుకెళ్లాడు. సాయంత్రం నాలుగు గంటల సమయంలో పిడుగుపాటుకు గురై ఐదు మేకలు, గొర్రె చనిపోగా మరో రెండు మేకలు గాయపడినట్టు బాధితుడు తెలిపాడు. మృతి చెందిన వాటి విలువ దాదాపు రూ.80వేలపైన ఉంటుందని బాధితుడు తెలిపారు. ప్రభుత్వం స్పందించి తనను ఆదుకోవాలని కోరాడు.

నార్నూర్ : పిడుగుపాటుకు రెండు ఆవులు మృత్యువాత పడ్డ సంఘటన మండలంలోని నాగల్‌కొండ గ్రామంలో గురువారం చోటు చేసుకుంది. మాజీ సర్పంచ్ సునితానారాయణ్ తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన రాథోడ్ జైవంత్‌రావుకు చెందిన రెండు ఆవులు రోజు మాదిరిగా వ్యవసాయక్షేత్రంలో మేత మేసి, చెట్టు కింద నిలబడ్డాయి. ఆ సమయంలో ఉరుములు, మెరుపులతో పిడుగుపడి రెండు ఆవులు మృత్యువాత పడ్డాయి. రెండు ఆవుల ధర రూ.80 ఉంటుదని, బాధితుడికి నష్టపరిహారం అందించి ఆదుకోవాలని కోరారు.



తలమడుగులో మృతి చెందిన ఎద్దు



కడెంలో మృతి చెందిన మేకలు

ప్రయివేటు పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలు



నవతెలంగాణ-నిర్మల్

ప్రయివేటు పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో అన్ని సౌకర్యాలు ఉన్నాయని జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ అన్నారు. గురువారం నిర్మల్ గ్రామీణ మండలం అక్కాపూర్ ప్రాథమికోన్నత పాఠశాలలో నిర్వహించిన బడిబాట కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడారు. బడి ఈడు పిల్లలందరిని ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్పించాలని తల్లిదండ్రులను కోరారు. ప్రభుత్వ పాఠశాలల్లో నిష్ణాతులైన ఉపాధ్యాయులు ఉన్నారని, విద్యార్థులకు మెరుగైన సౌకర్యాలను ఏర్పాటు చేశామని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో చేరిన విద్యార్థులందరికీ ఉచితంగా పాఠ్య పుస్తకాలు, ఏకరూప దుస్తులు, మధ్యాహ్న భోజనం, రాగిజావ, ఇతర ప్రభుత్వ ప్రోత్సాహకాలు అందుతాయని తల్లిదండ్రులకు వివరించారు. ఐదు సంవత్సరాలు నిండిన ప్రతి విద్యార్థిని పాఠశాలల్లో చేర్పించాలని సూచించారు. అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీల ద్వారా పాఠశాలల్లో అన్నిరకాల మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నట్లు తెలిపారు. అంతకముందు పాఠశాలలో అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ కార్యక్రమంలో భాగంగా జరిగిన పనులను కలెక్టర్ పరిశీలించారు. విద్యార్థులకు అందజేయు ఏకరూప దుస్తులను ప్రధానోపాధ్యయులకు అందజేశారు. అనంతరం చిన్నారులకు అంగన్వాడీ కేంద్రంలో ప్రవేశానికి కలెక్టర్ ప్రవేశపత్రం అందజేశారు. పిల్లల్ని అంగన్వాడి కేంద్రాల్లో చేర్పించడం వల్ల పోషకాలతో కూడిన ఆహారం, వారి మేధస్సు పెరిగేందుకు రకరకాల ఆటపాటలు ఉంటాయని తెలిపారు. విద్యార్థులు, ఉపాధ్యాయులతో ప్రతిజ్ఞ చేయించిన అనంతరం బడిబాట ర్యాలీని జెండా ఊపి ప్రారంభించారు.

చేపల చెరువు పరిశీలన

నిర్మల్ రూరల్ మండలంలోని కొండాపూర్ మండల సమైక్య వ్యవసాయ క్షేత్రాన్ని కలెక్టర్ సందర్శించారు. ఇక్కడ ఈజీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చేపల చెరువును ఆయన పరిశీలించారు. రైతులు చేపల చెరువు ఏర్పాటు చేసుకోవడం వల్ల లాభాలను పొందవచ్చని తెలిపారు. ఇక్కడ ఏర్పాటు చేసిన విధంగానే ప్రతి మండలానికి 30 మంది రైతులను గుర్తించి చేపల చెరువు ఏర్పాటు దిశగా వారిని ప్రోత్సహించాలని అధికారులకు సూచించారు. కార్యక్రమాలలో డీఈవో రవీందర్‌రెడ్డి, డిఆర్డిఓ విజయలక్ష్మి, విద్య, గ్రామీణాభివృద్ధి శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

పాఠశాలల ప్రారంభం కల్లా యూనిఫామ్‌లు అందించాలి

తాంసి : 12న పాఠశాలల పున:ప్రారంభం కల్లా విద్యార్థులకు ప్రభుత్వం ఉచితంగా అందిస్తున్న యూనిఫామ్‌లు సిద్ధం చేయాలని కలెక్టర్ రాజర్షి షా విద్యా శాఖ అధికారులకు, ఐకేపీ సిబ్బందికి సూచించారు. గురువారం మండల కేంద్రంలో ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట కార్యక్రమాన్ని ప్రారంభించారు. బడిబాట కార్యక్రమాన్ని విజయవంతం చేసి ప్రతి విద్యార్థి చదువుకునే విధంగా చూస్తామని అందరితో కలిసి ప్రతిజ్ఞ చేశారు. అనంతరం అమ్మ ఆదర్శ పాఠశాలల మౌలిక సదుపాయాలకు సంబంధించిన పనులను పరిశీలించి పనులను త్వరగా పూర్తిచేయాలని అధికారులను ఆదేశించారు. పాఠశాలకు మరుగుదొడ్లు, డైనింగ్ హాల్ నిర్మాణానికి నిధులు కేటాయించడంతో పాటు బస్సు సౌకర్యం కల్పించాలని మాజీ సర్పంచ్ కృష్ణతో పాటు పాఠశాల సిబ్బంది కలెక్టర్‌కు విన్నవించారు. విద్యార్థుల యూనిఫామ్ తయారు చేస్తున్న టైలర్‌లను సందర్శించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఈ నెల 6 నుండి 9వరకు బడిబాట కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందని, 11న ప్రతి గ్రామంలో గ్రామ సభలు నిర్వహించి చదువుకునే పిల్లల్ని బడిలో చేర్పించే విధంగా చూసుకోవాలని తెలిపారు. బడి మానేసిన పిల్లలకు మళ్లీ బడిలో చేర్పించుకోవాలని పాఠశాల సిబ్బందికి సూచించారు. ప్రభుత్వం విద్య కోసం అన్ని సదుపాయాలు కల్పిస్తామన్నారు. విద్యార్థులకు అవసరమైన వసతుల కోసం వెంటనే నిధులు మంజూరు చేస్తామని పేర్కొన్నారు. కొనసాగుతున్న పనులను ఐదు రోజుల్లో నాణ్యతతో పూర్తి చేయకపోతే నిధులు నిలిపేస్తామని పేర్కొన్నారు. టాలెంట్ టెస్ట్‌లో స్టేట్ మూడవ ర్యాంకు సాధించిన జింక పల్లవిని కలెక్టర్ శాలువాతో సన్మానించారు. అనంతరం సహకార సంఘం సొసైటీని సందర్శించి ఎరువులకు సంబంధించిన రిజిస్టర్లను తనిఖీ చేశారు. రైతులకు ఇబ్బంది కలగకుండా సకాలంలో ఎరువులను అందించాలని సొసైటీ సీఈఓ కేశవ్‌కు, మండల వ్యవసాయ అధికారి రవీందర్‌కు సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాధికారి ప్రణీత, తహసీల్దార్ లక్ష్మి, ఎంపీడీవో మోహన్‌రెడ్డి, పిఆర్ డిప్యూటీ ఈఈ శివరాం, డిపిఎం గంగన్న, ప్రధానోపాధ్యాయులు శ్రీనివాస్, అంగన్వాడీ సిబ్బంది ఉన్నారు.



ఉచిత శిక్షణ దరఖాస్తుకు రేపే ఆఖరు

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా నిరుద్యోగ యువకులకు నేషనల్ అకాడమీ ఆఫ్ కన్‌స్ట్రక్షన్(న్యాక్) ఆధ్వర్యంలో ఎలక్ట్రీషియన్, ప్లంబర్ కొరకు 3నెలలు ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు ఉమ్మడి జిల్లా న్యాక్ అసిస్టెంట్ డైరెక్టర్ నాగేంద్రం గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. శిక్షణ అనంతరం ఉపాధి అవకాశం కల్పిస్తామని పేర్కొన్నారు. రూ.18వేల నుండి 20వేల వరకు వేతనం ఉటుందని పేర్కొన్నారు. ఈ శిక్షణ కాలంలో ఉచిత భోజనం, హాస్టల్ వసతి కల్పిస్తారని పేర్కొన్నారు. ఈ శిక్షణకు ఎస్ఎస్‌సి పాస్ లేదా ఫెయిల్ అయిన విద్యార్థులు ఎవరైన శిక్షణ పొందవచ్చని పేర్కొన్నారు. ఆసక్తి గలవారు జూన్ 8వరకు జిల్లా కేంద్రంలో ఉన్న న్యాక్ సెంటర్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. వివరాలకు 9866565156 నెంబర్‌ను సంప్రదించాలని పేర్కొన్నారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
ఆదిలాబాద్-నిర్మల్
శుక్రవారం | జూన్ 07, 2024 | www.navatelangana.com

ఆర్మీ జవాన్‌కు ఘన స్వాగతం

నవతెలంగాణ-నార్నూర్



మండలంలోని తాడిహత్నూర్ గ్రామానికి చెందిన రాథోడ్ సంగీత కైలాస్ రెండో కుమారుడు రాథోడ్ ఆకాశ్ అగ్నిపథ్‌లో ఆర్మీ ఉద్యోగం సాధించాడు. ఆరు నెలల శిక్షణ పూర్తి చేసి, వచ్చిన సందర్భంగా గురువారం గ్రామ పెద్దలు యూత్ సభ్యులు కలిసి ఘన స్వాగతం పలికి శాలువాతో సన్మానించారు. పేద కుటుంబం నుంచి ఉద్యోగం సాధించి, దేశ సేవ చేయడం అభినందనీయమన్నారు. యువత ఆదర్శంగా తీసుకొని ముందుకు సాగాలని కోరారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు, యూత్ సభ్యులు ఉన్నారు.

విత్తనాల దుకాణాల్లో టాస్క్‌ఫోర్స్ అధికారుల తనిఖీలు

నవతెలంగాణ-ఉట్నూర్



మండలంలోని పలు విత్తనాల దుకాణాల్లో గురువారం మండల టాస్క్‌ఫోర్స్ అధికారులు తనిఖీలు నిర్వహించారు. విత్తనాలు నిల్వలు, స్టాక్ రిజిస్టర్లు, బిల్లు బుక్‌లను పరిశీలించారు. మండల వ్యవసాయ అధికారి రాథోడ్ గణేష్ మాట్లాడుతూ అనుమతి లేని విత్తనాలను నిల్వ చేసి అమ్మడం చేయకూడదని, అలాగే రైతులు విత్తనాలు తీసుకునేటపుడు తప్పకుండా రశీదులు తీసుకోవాలని అన్నారు. ఈ తనిఖీల్లో ఎస్సై మనోహర్, పోలీసు సిబ్బంది, రైతులు ఉన్నారు.

ప్రమాదకరంగా రోడ్లు.. పట్టించుకోని అధికారులు..

- గుంతలతో తరచూ ప్రమాదాలు
- మరమ్మతులు చేయించడంలో అధికారులు విఫలం

నవతెలంగాణ-తాంసి

భీంపూర్ మండలంలోని ధనోర గ్రామం నుంచి కరంజి(టి) వరకు ఉన్న అంతర్‌రాష్ట్ర రహదారి పూర్తిగా గుంతల మయంగా మారింది. దీంతో ఆ రోడ్డు గుండా వెళ్లే ప్రజలు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతూ ప్రయాణం కొనసాగిస్తున్నారు. భీంపూర్ మండలంలోని పలు గ్రామాలు ఉండగా కరంజి(టి) రహదారి పూర్తిగా అధ్వానంగా మారింది. గతంలో ప్రజాప్రతినిధులు అధికారుల దృష్టికి తీసుకువెళ్లడంతో రోడ్డు నిర్మాణనికి నిధులు మంజూరు చేశారు. కేవలం నిపాని గ్రామం నుంచి గోనా గ్రామం వరకే నిధులు ఇచ్చి పనులు పూర్తి చేశారు. ధనోరా నుంచి కరంజి వరకు ఉన్న రోడ్డు పూర్తిగా కంకర తేలి గుంతల మయంగా మారింది. కరంజి(టి), అర్లి, అంతర్గాం, వడూర్, భగవాన్‌పూర్, టెక్డి రాంపూర్, గుబిడి, కరణ్‌వాడి, గ్రామాల ప్రజలు ఈ రోడ్డు గుండానే రోజు ప్రయాణం సాగిస్తుంటారు.



కంకర తేలి గుంతలు పడి అధ్వానంగా మారిన బీటీ రోడ్డు



గుంతలను తప్పించబోయి ప్రమాదకరంగా రోడ్డు దిగిన బస్సు (ఫైల్)

రోడ్డు పనులు పూర్తి చేయాలి

సతీష్, గ్రామం కరంజి(టి)



గుంతల రోడ్డుపై ప్రయాణం కొనసాగించాలంటే ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని రోడ్డుపై ప్రయాణిస్తున్నాం. గతంలో కూడా రోడ్డు నిర్మాణం కోసం రాస్తారోకోలు చేశాం. ప్రజా ప్రతినిధులు నిధులు మంజూరయ్యాయని భూమిపూజ కూడా చేశారు. కానీ రోడ్డు నిర్మాణం పనులు ఇప్పటివరకు ప్రారంభం కాలేదు.

రోడ్డు నిర్మాణ పనులకు భూమిపూజ..

ఎమ్మెల్యేగా గెలిచిన అనిల్ జాదవ్ ధనోరా నుంచి కరంజి(టి) వరకు పనులు పూర్తి చేస్తానని పనులను భూమిపూజ చేశారు. కానీ ఇప్పటివరకు ఆ పనులు కొనసాగడం లేదు. ఈ రోడ్డు దుస్థితిని చూసి ఆర్టీసీ అధికారులు కూడా బస్సులను నడపడానికి జంకుతున్నారు. గత రెండు రోజుల కింద రోడ్డుపై ఏర్పడిన గుంతలను తప్పించబోయి అదుపుతప్పి రోడ్డు కిందకు వెళ్లిపోయింది. గతంలో కూడా అనేక సందర్భాల్లో మోటర్ సైకిల్ అదుపు తప్పి ఎన్నో ప్రమాదాలు సంభవించి ప్రాణాలు కోల్పోయిన సంఘటనలు ఉన్నాయి. ఏ పార్టీ అధికారంలోకి వచ్చినా ఏ నాయకుడు ఎమ్మెల్యేగా గెలిచినప్పటికీ మా రోడ్డు దుస్థితి పట్టించుకునే నాధుడు లేడని, ఆయా గ్రామాల మండల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రోడ్డు పనులు ప్రారంభించాలని కోరుతూ గతంలో ఆయా గ్రామాల ప్రజలు యువకులు రోడ్డు సాధన కమిటీలను ఏర్పాటు చేసుకొని, రాస్తారోకోలు, ధర్నాలు చేయడంతో పాటు ప్రజా ప్రతినిదులు నిలదీశారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు ప్రజాప్రతినిధులు స్పందించి గుంతలు పడిన రోడ్డు పనులను త్వరగా ప్రారంభించి, పూర్తి చేయాలని ఆయా గ్రామాల మండల ప్రజలు కోరుతున్నారు.

పనిచేయని చేతి పంపు



నవతెలంగాణ-జైనథ్

మండలంలోని నిరాల గ్రామంలోని ఎస్టీ కాలనీలో నెల రోజులుగా చేతి పంపు పనిచేయడం లేదని గ్రామస్తులు పేర్కొంటున్నారు. ఈ విషయాన్ని సంబంధిత అధికారులకు విన్నవించిన ఇప్పటి వరకు చెతిపంపును బాగు చేయించడం లేదని ఆరోపిస్తున్నారు. దీంతో ఆ కాలనీవాసులు పక్క కాలనీలోని బోరు వద్దకు వెళ్లి నీటిని తెచ్చుకుంటున్నారు. ఎండ కాలం నేపథ్యలో తాగునీటి ఇబ్బందులను ఎదుర్కొంటున్నామని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైన సంబంధిత శాఖాధికారులు చెతి పంపును బాగు చేయించి, తాగునీటి సమస్యను పరిష్కరించాలని కోరారు.

నాణ్యమైన విత్తనాలు విక్రయించాలి

నవతెలంగాణ-నార్నూర్

ప్రభుత్వం ద్వారా గుర్తింపు పొందిన నాణ్యమైన విత్తనాలను డీలర్లు విక్రయించాలని ఏఓ రమేష్ సూచించారు. గురువారం మండల కేంద్రంతో పాటు తాడిహత్నూర్‌లోని అన్ని విత్తన దుకాణాలను సందర్శించారు. విత్తన దుకాణంలో ఉన్న అన్ని రకాల విత్తనాలను స్టాక్ రిజిస్టర్‌ను తనిఖీ చేశారు. రైతులకు నకిలీ విత్తనాలు ఇచ్చి మోసగిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. విత్తనాలు, ఎరువులు మందులు తీసుకునేటప్పుడు రైతులు రశీదు తప్పనిసరిగా తీసుకోవాలని సూచించారు. ఆయన వెంట ఏఈఓ సాయికృష్ణ రైతులు ఉన్నారు.

ఫోన్ ఇన్ కార్యక్రమానికి స్పందన



నవతెలంగాణ-ఉట్నూర్

ఖానాపూర్ నియోజకవర్గంలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను నేరుగా ప్రజల నుండే తెలుసుకొని, ఆ సమస్యలను దశల వారీగా పరిష్కరించేందుకు ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ వినూత్న రీతిలో "ఫోన్ ఇన్ విత్ యువర్ ఎమ్మెల్యే" అనే కార్యక్రమానికి గురువారం శ్రీకారం చుట్టారు. ఈ కార్యక్రమంలో ఉట్నూర్, ఇంద్రవెల్లి, ఖానాపూర్, కడెం, జన్నారం, పెంబి, దస్తురాబాద్, సిరికొండ మండలాల వివిధ గ్రామాలకు చెందిన గ్రామస్తులు, ఉద్యోగులు ఫోన్ ద్వారా ఎమ్మెల్యేతో మాట్లాడి వారు ఎదుర్కొంటున్న నీటి, రోడ్డు, డ్రైనేజీ, కరెంటు, మిషన్ భగీరథ, జీఓ నెంబర్ 3, ఫారెస్ట్, జీఓ నెంబర్ 317, భూమీకి సంబంధించిన సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించి, సిఎం, మంత్రుల దష్టికి తీసుకెళ్లి సమస్యలను దశల వారీగా పరిష్కరిస్తామన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఖానాపూర్ నియోజకవర్గ అభివృద్దే లక్ష్యంగా ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. పేదింటి బిడ్డయిన తనకు ఎమ్మెల్యేగా గెలిపించినందుకు, నిత్యం ప్రజల మధ్య ఉంటూ ఈ ప్రాంత ప్రజల రుణం తీర్చుకుంటాననీ అయన తెలిపారు. ఈ ఫోన్ ఇన్ కార్యక్రమానికి ప్రజల నుంచి విశేష స్పందన లభించిందని తెలిపారు.

ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య



నవతెలంగాణ-జైనథ్

మండలంలోని కాన్పమేడిగూడ, రోడ్ గ్రామంలోని మండల పరిషత్ ప్రాథమిక, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలలో ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట కార్యక్రమాన్ని అమ్మఆదర్శ పాఠశాలల చైర్మెన్‌తో కలిసి ప్రధానోపాధ్యాయులు సత్యవాన్ చిక్టే, కొనిగెల నారాయణలు ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు సత్యవాన్ చిక్టే మాట్లాడుతూ కాన్పమేడిగూడ, రోడ్ గ్రామంలోని విధుల గుండా ర్యాలీ కొనసాగించమని అన్నారు. బడీడు పిల్లలు బడిలో ఉండాలనే నినాదంతో గ్రామస్తులకు అవగాహన కల్పించారు. బడిబాట కార్యక్రమం జూన్ 19 వరకు వివిధ కార్యక్రమాలు కొనసాగుతాయని తెలియజేశారు. కొత్తగా వచ్చే విద్యార్థులకు అడ్మిషన్ తీసుకోవడం జరుగుతుందని చెప్పారు. ప్రభుత్వ పాఠశాలలో పుస్తకాలు, రెండు జతల బట్టలు, ఉచితంగా మధ్యాహ్న భోజనంతో సహా వారానికి మూడు గుడ్లు అందజేస్తున్నామని అన్నారు. సకల సౌకర్యంతో ప్రభుత్వ పాఠశాలలు స్వాగతం పలుకుతున్నాయని, ఈ చక్కని అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. నాణ్యమైన చదువు, నిపుణులైన ఉపాధ్యాయులతో బోధన జరుగుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో అమ్మఆదర్శ పాఠశాల చైర్మెన్ సుజాత, ఉపాధ్యాయులు సంతోష్, దేవిదాస్, ప్రకాష్, పెంటపర్తి ఊశన్న, గ్రామ పంచాయతీ కార్యదర్శి నైమతుల్ల, మాజీ చైర్మెన్ పోలవేణి అడెల్లు, అంగన్‌వాడీ టీచర్స్ కళావతి, స్వప్న, గంగాదేవి, గ్రామస్తులు మమత, దేవరావ్, రమేష్ పాల్గొన్నారు.

ధనోరలో తాగునీటి గోస..

- అందని మిషన్ భగీరథ నీళ్లు
- ఎడ్లబండ్లలో నీళ్లు తెచ్చుకుంటున్న ప్రజలు

నవతెలంగాణ-ఇంద్రవెల్లి

వర్షాకాలం సమీపిస్తున్న తాగునీటి గోస తీరడం లేదు. ఎండలు మండుతుండటంతో భూగర్భ జలాలు అడుగంటాయి. మండలంలోని ధనోర(బి) గ్రామంలోని ఓహెచ్ఆర్ఎస్ ట్యాంకు ఉన్న రెండు మూడు రోజులకో సారి నీళ్లు వస్తున్నాయని గ్రామస్తులు పేర్కొన్నారు. గురువారం మిషన్ భగీరథ నీళ్ల రాకా పోవడంతో ఆ కాలనీ వాసులు అంగన్‌వాడీ కేంద్రం వద్ద ఉన్న ట్యాంకు నుంచి ఎడ్ల బండ్లలో నీటిని తెచ్చుకుంటున్నారు. ఈ సంధ్బంగా గ్రామస్తులు మాట్లాడుతూ ఓవర్ హెడ్ ట్యాంకు ఉన్న ప్రతి రోజు నీళ్లు రావడం లేదన్నారు. దీంతో తాము ఎడ్ల బండ్ల ద్వారా నీటిని తెచ్చుకోవాల్సిన దుస్థితి నెలకొందన్నారు. ప్రభుత్వం ఇటీవల ఎస్‌డీఎఫ్ నిధుల కింద బోర్‌ను మంజూరు చేసిన నీటి ఎద్దడి ఉన్న చోట తాగునీటి శాఖ అధికారులు కొత్త బోర్‌ను వేయలేదన్నారు. దీంతో తాము వ్యవసాయ పనులకు వెళ్లకుండా తాగునీటి కోసం గ్రామ పొలిమేరలో ఉన్న అంగన్‌వాడీ కేంద్రం వరకు వెళ్లాల్సి వస్తోందని ఆవేదనను వ్యక్తం చేశారు. ఇప్పటికైనా సంభందిత శాఖ అధికారులు తమ తాగునీటి గోస తీర్చాలని కోరుతున్నారు.





మిషన్ భగీరథ నీళ్లు రావడం లేదు.

చోలే లక్ష్మణ్, ధనోర(బి) గ్రామస్తుడు



మిషన్ భగీరథ కింద తమ వార్డుకు ఓవర్ హెడ్ ట్యాంకు నిర్మించిన ప్రతి రోజు నీళ్లు రావడం లేదు. రెండు మూడు రోజులకు ఒక సారి నీళు వస్తున్నాయి. తమ వార్డులో హ్యాండ్ బోర్ వెల్ వేస్తే తాగునీటి గోస కొంత తీరుతుందన్నారు. నీళ్ల రాక పోవడంతో మిషన్ భగీరథ అధికారులకు ఎన్ని సార్లు ఫోన్ లు చేసిన పట్టించుకోవడం లేదు. ఇప్పటికైనా అధికారులు స్పందించి, బోరు వేయాలని కోరుతున్నాం.

భూక్య జాన్సన్ నాయక్ జన్మదిన వేడుకలు



నవతెలంగాణ-ఉట్నూర్

పట్టణంలోని కుమురంభీం ప్రాంగణంలోని వికాసం పాఠశాలలో బీఆర్ఎస్ ఖానాపూర్ నియోజకవర్గ ఇన్‌చార్జీ భూక్య జాన్సన్ నాయక్ విద్యార్థులతో కలిసి కేక్ కట్ చేసి జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. అనంతరం పాఠశాల విద్యార్థులకు పండ్లు పంపిణీ చేశారు. గురువారం బీఆర్ఎస్వీ నాయకులు ధరణి రాజేష్ మాట్లాడుతూ భూక్య జాన్సన్ నాయక్ నిండు నూరేండ్లు ఆయూరారోగ్యాలతో అష్ట ఐశ్వర్యలతో సుఖ సంతోషాలతో బాగుండాలని ప్రజా సేవలో ముందు ఉండి ప్రజలకు అన్ని విధాల సేవలు అందించాలని మనస్పూర్తిగా కోరుకుంటూ జన్మదిన వేడుకలను జరుపుకున్నామన్నారు. ఈ కార్యక్రమంలో కాటం రమేష్, సాడిగే రాజ్‌కుమార్, దూట మహేందర్, సోనేరావు, ముజీబ్, గిరి, సాజిద్, పాండురంగ్, వినోద్ పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాల్లో కష్టాలు

నవతెలంగాణ-సిరికొండ

మండల కేంద్రంలోని రెండో అంగన్‌వాడీ కేంద్రాల్లో కష్టాలు తప్పడం లేదు. గురువారం మండల కేంద్రంలో భారీ వర్షం కురిసింది. దీంతో సెంటర్ పైకప్పు నుంచి లోపలికి నీరు చేరింది. ఎండాకాలంలో ఉక్కపోత, వర్ష కాలంలో సెంటర్‌లోకి నీళ్ల రావడంతో చాలా కష్టంగా ఉందని అంగన్‌వాడీ టీచర్ రాణి అన్నారు. వర్ష కాలంలో పిల్లలకు ఇబ్బందులను ఎదుర్కొంటారని తెలిపారు. అంగన్‌వాడీ సరకులు వర్షానికి తడిసిపోతాయని అన్నారు. ఇకనైనా తమ కష్టాన్ని గుర్తించి ప్రభుత్వం నూతన భవనాన్ని నిర్మించి ఇవ్వాలని కోరారు.

బీసీజీ వ్యాక్సినేషన్‌పై అవగాహన

నవతెలంగాణ-నార్నూర్

క్షయ వ్యాధిని అరికట్టేందుకు బీసీజీ వ్యాక్సినేషన్ వేయాలని పీహెసీ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ రాంబాబు ఆశా కార్యకర్తలు, వైద్య సిబ్బందికి సూచించారు. గురువారం మండల కేంద్రంలో పీహెచ్‌సీలో బీసీజీ వ్యాక్సినేషన్‌పై సిబ్బందికి అవగాహన కల్పించారు. టీబీ సోకడానికి కారణాలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలు ప్రజలకు తెలియజేయాలన్నారు. వర్షాకాలం వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమం సీహెచ్ఓ లక్ష్మి, హెచ్ఈఓ నాందేవ్, పీహెచ్ఎన్ఓ సుశీల, హెల్త్ సూపర్ వైజర్ చౌహన్ చరణ్‌దాస్, రాజమ్మ వైద్య సిబ్బంది దినేష్, వివిధ గ్రామాల ఆశాలు వైద్య సిబ్బంది ఉన్నారు.

పిడుగులు పడే కాలం.. జాగ్రత్తలే ప్రాణాలకు రక్ష

- మేఘాల్లోని పాజిటివ్, నెగిటివ్ వల్లే...
- వర్షం పడుతుంటే చెట్ల కిందకు, ట్రాన్స్ పార్మర్ల వద్దకు వెళ్లొద్దు
- మెరుపులను చూసేందుకు ప్రయత్నించొద్దు

నవతెలంగాణ-ఇచ్చోడ

ఈ ఏడాది ముందుగా నైరుతీ రుతుపవనాలు తెలంగాణ రాష్ట్రంలోకి వచ్చాయి. కొన్ని ప్రాంతాల్లో భారీ వర్షాలు కురుస్తున్నాయి. ఉరుములు మెరుపులతో వర్షాలు పడే అవకాశం ఉన్నందున పిడుగులు పడే అవకాశం ఎక్కువే..! ఆకాశం మేఘావృతమై, బలమైన ఈదురుగాలతో వాన పడేటప్పుడు మెరుపులు వచ్చి, పెద్ద శబ్దాలతో పిడుగులు పడతాయి. వీటికి బలమైన ఆయస్కాంత శక్తితో కూడిన విద్యుత్ శక్తి ఉంటుంది. అందుకే మనుషులతో పాటు జంతువులు చనిపోతాయి. పిడుగులు ప్రభావానికి పచ్చని చెట్లు సైతం కాలిపోతుంటాయి. ఎక్కువగా వ్యవసాయ పనులకు వెళ్లే రైతులే పిడుగుపాటుకు బలవుతుంటారు. గతంలో రెండు సంవత్సరాల కింద ఇచ్చోడ మండలంలోని కేశవపట్నం గ్రామానికి చెందిన పిల్లాడు షేక్ హాసాద్ (9) సాయంత్రం వేళ ఎద్దులకు నీరు పెట్టడానికి పశువుల పాక నుంచి కొద్ది దూరంలో ఉన్న నీటి తొట్టిలో ఎద్దులకు నీరు పెట్టి తిరిగి పశువుల పాకలోకి ముందు ఎద్దులు వెళ్లగా యువకుడు లోపలికి వెళ్లే సమయంలో పిడుగుపాటుకు గురై యువకుడు అక్కడిక్కడే మృతిచెందాడు. ఇలాంటి సంఘటన ప్రతి సంవత్సరం జరుగుతున్నాయి. పిడుగులు పడే కాలంలో ముందస్తు జాగ్రత్తలే ప్రాణాలకు రక్ష.



పిడుగు అంటే..

మేఘాలలో ఉష్ణోగ్రత చాలా తక్కువ ఉండటం వల్ల వర్షపు నీరు చిన్న మంచు కణాలుగా విడిపోతుంది. విపరీతమైన గాలులు వచ్చినప్పుడు వాటి మధ్య రాపిడి జరిగి, ఒక ఎలక్ట్రానిక్ ఛార్జ్ విడుదలవుతుంది. ఇందులోని పాజిటివ్ కణాలు తేలికగా ఉండటం వల్ల మేఘాల పైకి వెళ్తుంటే, నెగిటివ్ కాణాలు బరువుగా ఉండి కిందికి వెళు తుంటాయి. అయస్కాంతంలో ఉత్తర, దక్షిణ ధృవాలు ఆకర్షిస్తున్నట్లుగానే రెండు మేఘాలు దగ్గరగా వచ్చినప్పుడు పాజిటివ్, నెగటివ్ కణాలు ఆకర్షించుకొని మెరుపులు వస్తాయి. ఈ సమయంలో మేఘంలోని నెగిటివ్ కణాలు, భూమిలో పాజిటివ్ కాణాలను ఆకర్షిస్తుంటాయి. అప్పుడు భూమిపై ఎత్తుగా ఉండే చెట్లు గుట్టలు మనుషుల ద్వారా మెరుపులతో కూడిన పిడుగు పడుతుంది.

అప్రమత్తంగా ఉండాలి...

వర్షాలు పడే సమయంలో బయటకు వెళ్లకపోవడమే ఉత్తమం. ముఖ్యంగా వ్యవసాయ పనులకు వెళ్లిన రైతులు, రైతు కూలీలు అప్రమత్తంగా ఉండాలి. ఆకాశంలో ఉరుములు మెరుపులు వస్తుంటే చెట్ల కిందకు, విద్యుత్ టవర్లు, ట్రాన్స్ పార్మర్ల సమీపంలోకి వెళ్లొద్దు. పిడుగుపడే సమయంలో ఆకాశంలోని మెరుపులు అత్యధిక శక్తిని కలిగి ఉంటాయి. ఆ వెలుతురును చూసేందుకు ప్రయత్నించవద్దు. పిడుగు కొన్ని మిలియన్ మెగావాట్ల శక్తి ఉంటుందనే విషయాన్ని ప్రతి ఒక్కరూ గుర్తుంచుకోవాలి.

రైతులు సమయస్ఫూర్తితో వ్యవహరించాలి

వ్యవసాయ పనులు చేసేటప్పుడు ఉరుములు, మెరుపులు వస్తుంటే పిడుగులు పడతాయని భావించి, రైతులు మరింత జాగ్రత్తతో ఉండాలి. వెంటనే సురక్షిత ప్రాంతానికి చేరుకోవాలి. ఒకవేళ వీలు కాకపోతే సమయస్ఫూర్తితో వ్యవహరించి, మోకాళ్లపై చేతులు, తలపెట్టి, దగ్గరగా ముడుచుకొని కూర్చోవాలి. దీనివల్ల సమీపంలో పిడుగు పడినా అందులోని విద్యుత్ ప్రభావం తక్కువ ఉండి బతికేందుకు అవకాశాలు ఉంటాయి. పిడుగు పడుతుందని అనిపించినప్పుడు రబ్బర్ చెప్పులు వేసుకోవడం మంచిది. ఒకవేళ వేసుకోలేని పరిస్థితి ఉన్నప్పుడు కాలును భూమి మీద పూర్తిగా అనించొద్దు. కాలి వెళ్ల మీద ఉండేందుకు ప్రయత్నించాలి.

విద్యుత్ పరికరాలకు నష్టం..

పిడుగు పడినప్పుడు విద్యుత్ పరికరాలకు ఎక్కువగా నష్టం జరిగే అవకాశం ఉంటుంది. ఉరుములు మెరుపులు వస్తుంటే విద్యుత్ స్తంభాలు ట్రాన్స్ పార్మర్లకు దూరంగా ఉండాలి. ఇంట్లోనే ఎలక్ట్రానిక్ పరికరాలైన టీవీ, రిఫ్రిజిరేటర్, సెల్ ఫోన్ వంటి వాటిని వినియోగించుకోవడం ఉత్తమం, అలాగే మెరుపులు వస్తున్నప్పుడు ఆరుబయట స్నానం చేయడం, వంట పాత్రలు కడగడం చేయవద్దు. లోహపు వస్తువుల ద్వారా విద్యుత్ ప్రవహించే అవకాశాలు ఎక్కువ ఉంటాయి.

ప్రశాంతంగా కౌన్సెలింగ్

నవతెలంగాణ-ఉట్నూర్

ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరంలో గురుకుల కళాశాలలో మిగిలిన సీట్లకు కౌన్సెలింగ్ నిర్వహించారు. మేరిట్ ఆధారంగా భర్తీ చేస్తున్నామని ఆర్‌సీఓ గంగాధర్ అన్నారు. గురువారం ఉట్నూర్ మండలంలోని గురుకుల కళాశాల బాలురు, లాల్ టెక్‌డీలో విద్యార్థులకు కౌన్సెలింగ్ నిర్వహించారు. ఎంపీసీ, బైపీసీ, సీఈసీ, హెచ్ఈసీ, గ్రూప్‌లో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని గురుకుల కళాశాల బాలురు, బాలికలను కౌన్సెలింగ్ నిర్వహించి, జీపీఏ ఆధారంగా సీట్లు భర్తీ చేశామని తెలిపారు. కొలాం, తోటి, బాలబాలికలను కార్పొరేట్ కళాశాలలో మెరిట్ లేకుండా భర్తీ చేస్తున్నామని ఇంకా ఇంటర్ మొదటి సంవత్సరంలో కొలాం, తోటి విద్యార్థులకు సీట్లు కాలంటే నేరుగా ఆర్‌సీఓ ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా కోఆర్డినేటర్ యశ్వంత్‌రావును సంప్రదించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో గురుకుల కళాశాల ప్రిన్సిపాల్, లెక్చరర్‌లు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

బడీడు పిల్లలను బడిలో చేర్పించాలి



నవతెలంగాణ-ఉట్నూర్

ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట కార్యక్రమాన్ని గురువారం ఆందోలి పాఠశాల ప్రధానోపాధ్యాయులు జాదవ్ చంద్రకాంత్, ఉపాధ్యాయులు చావాన్ జైవంత్‌రావు నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. బడీడు పిల్లలు ప్రతి ఒక్కరిని బడిలో చేర్పించే బాధ్యతలు తల్లి తండ్రుల తీసుకొని, మీ పిల్లలకు పాఠశాలకు పంపాలని కోరారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఇంద్రవెల్లి : మండలంలోని వివిధ ప్రభుత్వ పాఠశాలల్లో బడిబాట కార్యక్రమం కొనసాగుతోంది. గురువారం ఆయా ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులు, ఉపాధ్యాయులు, కలిసి గ్రామంలోని వీధుల గుండా ర్యాలీని నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రయివేటు బడి వద్దురా.. సర్కారు బడి ముద్దురా.. అంటూ నినాదాలు చేశారు. సర్కారు బడుల్లో ప్రభుత్వ విద్యార్థులకు కల్పిస్తున్న ఉచిత పుస్తకాలు, రెండు జతల యూనిఫాంలు, మధ్యాహ్న భోజన పథకాలపై విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. ధనోర(బి)లో ప్రధానోపాధ్యాయులు అశోక్, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలలోనే మెరుగైన విద్య

నవతెలంగాణ-నేరడిగొండ

ప్రభుత్వ పాఠశాలలోనే మెరుగైన విద్య అందుతుందని పాఠశాల ప్రధానోపాధ్యాయులు రాధా అన్నారు. గురువారం మండల కేంద్రంలోని వాంకిడి గ్రామంలో బడిబాట కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా పాఠశాల విద్యార్థులతో కలిసి ర్యాలీతో గ్రామంలోని వీధి వీధి తిరుగుతూ బడీడు పిల్లలని బడిలో చేర్పించాలి అంటూ నినాదాలు చేశారు. రాష్ట్ర ప్రభుత్వం అమ్మ ఆదర్శ కార్యక్రమాల ద్వారా పాఠశాలలోని ఎన్నో మౌలిక సదుపాయాలు కల్పించడం జరుగుతుందని అన్నారు. ప్రభుత్వ పాఠశాలలో చదువుకోవాలని, ప్రభుత్వ పాఠశాలలో తెలుగు, ఇంగ్లీష్ మీడియం చదివించడానికి నేర్పించడానికి ఉపాధ్యాయులు ఉన్నారని, మెరుగైన విద్యను బోధిస్తున్నామని అన్నారు.



నీట్‌లో మెరిసిన రైతు బిడ్డ

నవతెలంగాణ-చింతలమానేపల్లి



నీట్‌లో మండలంలోని లంబాడీహెటి గ్రామానికి చెందిన రైతు బిడ్డ మెరిసింది. రైతు అజ్మీరా సావిత్రి, భీముకు ముగ్గురు పిల్లలున్నారు. వీరిని ఉన్నత శిఖరాలకు తీసుకెళ్లాలనే సంకల్పంతో కష్టాలను ఇష్టంగా తీసుకుంటు ముందుకు సాగుతున్నారు. ఇదే క్రమంలో మంగళవారం ప్రకటించిన నీట్ ఫలితాలలో మూడవ కూతురు శైలజ 720 మార్కులకు గాను 580 మార్కులు సంపాదించి, కేటగిరి ర్యాంక్ 820తో ఉత్తమ ప్రతిభ కనబర్చింది. ఈ సందర్భంగా కూతురిని తల్లిదండ్రులు అభినందించారు. ఐదో తరగతి నుండి పదో తరగతి వరకు సోషల్ వెల్ఫేర్ సిర్పూర్-టి, ఇంటర్ నిర్మల్‌లోని టీఎస్ఆర్‌జేసీ కళాశాలలో పూర్తి చేసింది. అనంతరం ఎంబీబీఎస్ సీటు సాధించాలనే పట్టుదలతో రెండు సంవత్సరం పాటు లాంగ్ టర్మ్ పూర్తి చేసి 720/580 మార్కులు సంపాదించింది. విషయం తెలుసుకున్న గ్రామస్తులు విద్యార్థినికి అభినందనలు తెలిపారు.

ఆస్పత్రులు నిబంధనలు పాటించాలి

నవతెలంగాణ-ఆసిఫాబాద్



ప్రయివేట్ ఆస్పత్రులు నిబంధనలు పాటించాలని వైద్య ఆరోగ్యశాఖ అధికారులు సూచించారు. జిల్లా కేంద్రంలోని ప్రయివేట్ ఆస్పత్రి, రికార్డులను ప్రోగ్రాం అధికారి డాక్టర్ సిద్ధార్థ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా ప్రయివేట్ ఆస్పత్రులు వ్యవహరించాలన్నారు. లింగ నిర్ధారణ ఎట్టి పరిస్థితుల్లో చేయకూడదని సూచించారు. ఒకవేళ లింగ నిర్ధారణ చేసినట్లు తెలిస్తే లైసెన్స్ రద్దు చేయడం జరుగుతుందని హెచ్చరించారు. రికార్డులను ఎప్పటికప్పుడు సరిగ్గా నిర్వహించాలని, ఆస్పత్రి నిర్వహణ శుభ్రంగా ఉండేలా చూడాలన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ డెమో నాగలక్ష్మి, జూనియర్ అసిస్టెంట్లు మణికాంత్, సాయికుమార్ పాల్గొన్నారు.

లోక్ అదాలత్ విజయవంతం చేయాలి

- జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎంవీ రమేష్



నవతెలంగాణ-ఆసిఫాబాద్

ఈనెల 8న జిల్లా కోర్టు ఆవరణలో నిర్వహించే లోక్ అదాలత్ విజయవంతం చేయాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎంవీ రమేష్ తెలిపారు. జిల్లా కేంద్రంలోని ఆయన కార్యాలయంలో సీనియర్ సివిల్ జడ్జి యువరాజతో కలిసి లోక్ అదాలత్ నిర్వహణపై విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లోక్ అదాలత్ ద్వారా కేసులు పరిష్కారమయ్యేలా చూస్తామని తెలిపారు. గత మార్చి 16న నిర్వహించిన లోక్ అదాలత్‌లో 2346 వివిధ రకాల కేసుల పరిష్కారం చేయడం జరిగిందని, ప్రస్తుతం అంతకుమించి కేసులు పరిష్కారానికి వచ్చేలా చూస్తున్నట్లు తెలిపారు. వయసు, అనారోగ్య, వాతావరణ కారణంగా బయటకు రాని వారికి ఆన్‌లైన్ ద్వారా కూడా తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. జిల్లాలో మొత్తం నాలుగు బెంచీలు ఏర్పాటు చేస్తున్నామని, ఆసిఫాబాద్‌లో మూడు బెంచీలు, సిర్పూర్ కాగజ్‌నగర్ ఒక బెంచ్ ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. మోటార్ వెహికల్, ఈ-చలాన్, డిజాస్టర్‌కు సంబంధించిన కేసులు కూడా పరిష్కరించడం జరుగుతుందన్నారు. ప్రాధాన్యతను బట్టి కోర్టులో పెండింగ్ లేని కేసులు కూడా పరిష్కరించే విధంగా రాజీ చేయడం జరుగుతుందని, కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

అసంక్రమిత వ్యాధిగ్రస్తులను గుర్తించాలి

- ఎన్సీడీ రాష్ట్ర కన్సల్టెంట్ అబ్దుల్ వసీ



నవతెలంగాణ-ఆసిఫాబాద్

అసంక్రమిత వ్యాధిగ్రస్తులను ఎప్పటికప్పుడు గుర్తించాలని అసంక్రమిత వ్యాధుల(ఎన్సీడీ) రాష్ట్ర కన్సల్టెంట్ అబ్దుల్ వసి అన్నారు. జిల్లా కార్యాలయంలో అసంక్రమిత వ్యాధులపై సిబ్బందికి శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రాల పరిధిలో ఉన్న అసంక్రమిత వ్యాధులు మధుమేహం, బీపీ లాంటి వ్యాధిగ్రస్తులను గుర్తించాలని అప్పుడే వైద్యం అందించడానికి అవకాశం ఉంటుందన్నారు. జిల్లాలో 20వేల హైపర్ టెన్షన్ వ్యాధిగ్రస్తులు, 7010 మంది మధుమేహ వ్యాధిగ్రస్తులున్నట్లు గుర్తించారని, వారందరినీ అబా కార్డుల్లో నమోదు చేయాలని సూచించారు. శిక్షణ తీసుకున్న సూపర్‌వైజర్లు వారివారి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ జిల్లా వైద్యాధికారి సుధాకర్ నాయక్, ప్రోగ్రాం ఆఫీసర్లు డాక్టర్ వినోద్ కుమార్, డాక్టర్ సిద్ధార్థ, వైద్యాధికారులు, ఎన్సీడీ కోఆర్డినేటర్ సంతోష్, సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

నకిలీ విత్తనాలు విక్రయిస్తే కఠిన చర్యలు

- కలెక్టర్ వెంకటేష్ ధోత్రే

నవతెలంగాణ-ఆసిఫాబాద్

నకిలీ, కాలంచెల్లిన విత్తనాలు, నిషేధిత పురుగుమందులు అమ్మితే కఠిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ వెంకటేష్ ధోత్రే డీలర్లను హెచ్చరించారు. గురువారం జిల్లా కేంద్రంలోని ఎంఎస్ రాయల్ ఆగ్రోస్ విత్తనాలు, ఎరువులు, పురుగుమందుల దుకాణాన్ని అదనపు కలెక్టర్ దీపక్ తివారీతో కలిసి కలెక్టర్ ఆకస్మిక తనిఖీ చేశారు. విత్తన, ఎరువుల గోదాం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కంపెనీ నిర్ణయించిన ధరలకే విత్తనాలు, ఎరువులను విక్రయించాలని ఆదేశించారు. అధిక ధరలకు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. డీలర్లు లైసెన్సు, దుకాణం అనుమతి వివరాలు, స్టాకు నిలువ, ధరల పట్టికను షాపు ముందు బోర్డుపై ఉంచాలన్నారు. విత్తన డీలర్లు రైతులకు నాణ్యమైన విత్తనాలు అందేలా చర్యలు తీసుకోవడంతో పాటు కొనుగోలు చేసిన విత్తనాలకు సంబంధించిన తగిన రశీదును ఇవ్వాలన్నారు. నకిలీ విత్తనాల విక్రయాల వల్ల రైతులు నష్టపోతే డీలర్లు, సంబంధిత కంపెనీ యజమానులపై చట్టపరమైన చర్యలుంటాయని హెచ్చరించారు. రైతులు విత్తనాల ఖాళీ సంచులను పంటకాలం పూర్తయ్యే వరకు భద్రపరుచుకోవాలని, ఒకవేళ రైతు నష్టపోతే ఆయా కంపెనీల నుండి నష్టపరిహారం పొందేందుకు అవకాశం ఉందన్నారు. రెవెన్యూ వ్యవసాయ, పోలీస్ టాస్క్ ఫోర్స్ అధికారులు సమన్వయం చేసుకుని జిల్లాలో నకిలీ విత్తనాల రవాణా, విక్రయాలు అరికట్టాలని తెలిపారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ ప్రభాకర్ రావు, మండల వ్యవయాధికారి ఖాదర్ హుస్సేన్, సీఐ సతీష్ పాల్గొన్నారు.



ఆసిఫాబాద్ : స్టాకు వివరాలు తెలుసుకుంటున్న కలెక్టర్ వెంకటేష్ ధోత్రే, అదనపు ఎస్పీ ప్రభాకర్ రావు



బెజ్జూర్ : విత్తనాల దుకాణంలో రిజిస్టర్‌ను పరిశీలిస్తున్న జిల్లా వ్యవసాయ శాఖ అధికారి శ్రీనివాస రావు

బెజ్జూర్ : మండలంలోని సోమిని, మొగవెల్లి, బెజ్జూర్ తదితర గ్రామాల్లోని ఎరువుల దుకాణాలను జిల్లా వ్యవసాయ అధికారి(డీఏఓ) శ్రీనివాసరావు గురువారం తనిఖీ చేశారు. రికార్డులతో పాటు స్టాక్‌ను పరిశీలించారు. రైతులకు అందుబాటులో పత్తి విత్తనాలు ఉన్నాయా లేదా అని అడిగి తెలుసుకున్నారు. అన్ని బీటీ విత్తనాలు ఒకే రకంగా దిగుబడిని అందిస్తుందని ఆయన తెలిపారు. నకిలీ విత్తనాలను కొని రైతులు నష్టపోవద్దని, బీటీ రకం విత్తనాలు కంపెనీలన్నీ ఒకే రకంగా ఉంటాయని రైతులకు సూచించారు. రికార్డులను సక్రమంగా ఉంచాలని డీలర్లను ఆదేశించారు. ఆయన వెంట ఏఈఓ శ్రీధర్ ఉన్నారు.

కౌటాల : నకిలీ విత్తనాలు అమ్మితే చర్యలు తప్పవని ఏఈఓ చౌదరి అంజన్న అన్నారు. గురువారం మండలంలోని గుండాయిపేట్ గ్రామంలో ఎరువుల దుకాణలను తనిఖీ చేసి సూచనలు చేశారు. స్టాక్ రిజిస్టర్‌లో స్టాక్ నమోదు చేయాలన్నారు. స్టాక్ బోర్డులో రోజు వారీగా అందుబాటులో ఉన్న విత్తనాలు, ధరలు రాయాలని ఆదేశించారు. ప్రభుత్వం నిర్ణయించిన ఎంఆర్‌పీ ధరలకే అమ్మాలని సూచించారు. రైతులకు రసీదులను అందించాలన్నారు. నకిలీ విత్తనాలు అమ్మితే చర్యలుంటాయని హెచ్చరించారు. ఎలాంటి సమస్యలున్న వ్యవసాయ శాఖ అధికారులకు తెలియజేయాలన్నారు.

ఆర్ఎంపీ, పీఎంపీలకు శిక్షణ ఇవ్వాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్ఎంపీ, పీఎంపీ సంఘం నాయకులు

నవతెలంగాణ-సిర్పూర్(టి)

గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు ప్రథమ చికిత్స అందిస్తున్న ఆర్ఎంపీ, పీఎంపీలను గుర్తించి శిక్షణ ఇవ్వాలని, అన్యాయంగా ఆర్ఎంపీలపై ప్రభుత్వం దాడులు చేయడం సరికాదని ఆర్ఎంపీ, పీఎంపీలు అన్నారు. దాడులను నిరసిస్తూ గురువారం నుంచి వారి సేవలను స్వచ్ఛందంగా బంద్ చేశారు. అనంతరం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. ప్రభుత్వం పెద్ద ఆస్పత్రి, కార్పోరేట్ ఆస్పత్రుల యజమాన్యనికి తలోగ్గి ప్రభుత్వం ఆర్ఎంపీ, పీఎంపీలపై దాడులు చేయిసుతందని తెలిపారు. గ్రామాల్లో ఏండ్ల తరబడి సేవలు అందిస్తున్నామన్నారు. ఏనాడూ ప్రభుత్వానికి భారం కాలేదని, గ్రామాల్లో వైద్య సేవలు అందించకుంటే దొంగలు, రౌడిషిటర్లుగా చిత్రీకరించి చూడడం సమంజసం కాదన్నారు. ఆర్ఎంపీ, పీఎంపీలతో ప్రభుత్వానికి లాభమే కానీ నష్టం లేదన్నారు. అనంతరం మండల నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షునిగా అజ్మీరా ఉమేష్, ఉపాధ్యక్షునిగా మాన్కార్ ఎమాజీ, జనరల్ సెక్రటరీగా రఘునాథ్, గౌరవ అధ్యక్షులుగా రజ్జబ్ ఆలీ, రంటెంకే శంకర్, కోశాధికారిగా పరమేష్‌లను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా సమస్యలపై పోరాటం చేస్తామన్నారు. కార్యక్రమంలో లక్ష్మణ్, శంకర్, సంతోష్, రతన్, అశోక్, అనిల్, షకీర్, అమృత్ సర్దార్, గురుపాద, ఆర్ఎంపీ, పీఎంపీలు పాల్గొన్నారు.

గ్రూప్-1 పరీక్ష పకడ్బందీగా నిర్వహించాలి

- కలెక్టర్ వెంకటేష్ ధోత్రే



నవతెలంగాణ-ఆసిఫాబాద్

ఈనెల 9న జిల్లాలో జరగనున్న గ్రూప్-1 ప్రిలిమినరీ పరీక్ష నిర్వహణ పకడ్బందీగా చేపట్టాలని కలెక్టర్ వెంకటేష్ ధోత్రే అధికారులకు సూచించారు. గురువారం జిల్లా కేంద్రంలోని పీటీజీ బాలుర పాఠశాలలోని పరీక్ష కేంద్రంలో ఏర్పాట్లను అదనపు కలెక్టర్ దీపక్ తివారి, అదనపు ఎస్పీ ప్రభాకర్, సీఐ సతీష్, ప్రాంతీయ సమన్వయకర్త లక్ష్మీనరసింహ, పాఠశాల ప్రిన్సిపల్‌తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రూప్-1 సర్వీసెస్ ప్రిలిమినరీ పరీక్ష పకడ్బందీగా నిర్వహించేందుకు పూర్తిస్థాయి ఏర్పాట్లు చేశామన్నారు. పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు చేస్తూ జిరాక్స్ సెంటర్లను మూసి ఉంచడం జరుగుతుందన్నారు. అభ్యర్థులు సకాలంలో పరీక్షా కేంద్రాలకు చేరుకునే విధంగా ప్రత్యేక బస్సులు, నిరంతర విద్యుత్ సరఫరా, వేసవి ఉష్ణోగ్రత దృష్ట్యా ఓఆర్ఎస్ ప్యాకెట్లు, మందులు, ప్రథమ చికిత్స కిట్లు, వైద్య సిబ్బందిని అందుబాటులో ఉంచామన్నారు. పరీక్షకు హాజరయ్యే అభ్యర్థులకు హాల్‌టిక్కెట్లను టీజీపీఎస్సీ వెబ్‌సైట్ నుండి డౌన్‌లోడ్ చేసుకోవచ్చని, ఉదయం 9 గంటల నుండి 10 గంటల వరకు మాత్రమే అభ్యర్థులను పరీక్షా కేంద్రంలోనికి అనుమతిస్తామన్నారు. 10 తరువాత పరీక్షా కేంద్రంలోనికి అనుమతి ఉండదని తెలిపారు. ఒక రోజు ముందుగా కేంద్రాలను నిర్ధారించుకోవాలని సూచించారు. వ్యక్తిగత ఓఎంఆర్ షీట్లపై సంబంధిత అభ్యర్థుల వివరాలు ముద్రించి వస్తాయని, అట్టి వివరాలతో పాటు, పరీక్ష నియమ, నిబంధనలను సరిచూసుకోవాలన్నారు. బూట్లు, మొబైల్ ఫోన్లు, ఎలక్ట్రానిక్ పరికరాలను అనుమతించామని తెలిపారు. ప్రతి అరగంటకు ఒకసారి సమయాన్ని తెలియజేసేలా గంట మోగిస్తామన్నారు. పరీక్షకు హాజరయ్యే ముందు పరీక్ష సంబంధించిన నియమ, నిబంధనలను చదువుకొని పూర్తిగా తెలుసుకొని ఉండాలన్నారు. అభ్యర్థులు తమ వెంట ప్రభుత్వంచే జారీ చేసిన ఏదైనా ఒక ఫొటో గుర్తింపు కార్డు తీసుకురావాలని, కొత్తగా దిగిన పాస్‌పోర్ట్ సైజ్ ఫొటో హాల్‌టిక్కెట్‌పై అతికించాలని సూచించారు.

బడుల్లో విద్యార్థుల సంఖ్య పెంచడమే లక్ష్యం

- ప్రారంభమైన బడిబాట

నవతెలంగాణ-కాగజ్‌నగర్ రూరల్

మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో గురువారం బడిబాట కార్యక్రమం ప్రారంభమైంది. అరెగూడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు పర్శ చంద్రశేఖర్, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్‌పర్సన్ బి.లావణ్య ఆధ్వర్యంలో పాఠశాల ఉపాధ్యాయులు బడిబాట ప్రతిజ్ఞ చేశారు. అనంతరం గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. చింతగూడ జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాలలో ఉపాధ్యాయులు విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. ప్రధాన వీధుల గుండా నినాదాలు చేస్తూ నాణ్యమైన చదువకు ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలన్నారు. కార్యక్రమంలో చింతగూడ ప్రధానోపాధ్యాయులు సుధాకర్, లక్ష్మి నారాయణ, ఉపాధ్యాయులు శ్రీనివాస్, గులాబ్‌రావ్, సంపత్, మోహన్, పండరినాథ్, ప్రదీప్, లక్ష్మణ్, బాలకిషన్, లావణ్య, పంచాయతీ సెక్రెటరీ హరీష్, మోసం పంచాయతీ కార్యదర్శి జి.రాజేశ్వరి, ఆరెగూడ ఉపాధ్యాయులు బి.రాజేశం, బి.అనిత, రమేష్, విరాసత్ అలీ హస్మి, స్వరూప, అనూష పాల్గొన్నారు.

బెజ్జూర్ : బడి ఈడు పిల్లలను బడిలో చేర్పించాలని బెజ్జూర్ జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు సునీత అన్నారు. గురువారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాలలో బడిబాట కార్యక్రమంలో భాగంగా ప్రతిజ్ఞ నిర్వహించారు. ప్రభుత్వ పాఠశాలలో నాణ్యమైన బోధనతో పాటు ఉచితంగా పుస్తకాలు, యూనిఫాం అందిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో బెజ్జూరు గ్రామపంచాయతీ ప్రత్యేక అధికారి వెంకటేశం, సీఆర్‌పీ శ్రీనివాస్, ఉపాధ్యాయులు శ్రీనివాస్, విటోబా, బీజేపీ నాయకుడు సామల తిరుపతి, విద్యార్థులు ,పాల్గొన్నారు.

కౌటాల : ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట కార్యక్రమాన్ని మండలంలోని ముత్తంపేట్‌లో నిర్వహించారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు గావుడే హనుమంతు ప్రణాళిక తయారు చేసి ఉపాధ్యాయులతో చర్చించారు. అనంతరం గ్రామంలో బడిబాట కార్యక్రమం నిర్వహించి బడి ఈడు పిల్లలను బడిలో చేర్పించాలన్నారు. కార్యక్రమంలో అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ సభ్యులు, వీఓ అదే మౌనిక, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పెంచికల్‌పేట్ : ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నామని విద్యార్థులను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించి సౌకర్యాలను సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ అల్బర్ట్ అన్నారు. మండలంలోని చేడువాయిలో బడిబాట కార్యక్రమంలో భాగంగా గ్రామంలో విద్యార్థులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాలలో ఉచిత పుస్తకాలు, యూనిఫామ్, బోధన సిబ్బంది ఉంటారని, ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులు చదువుకొని ఉన్నత శిఖరాలు చేరుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎంపీఓ గంగాసింగ్, ఉపాధ్యాయులు రాకేష్, వెంకటేష్, గ్రామస్తులు పాల్గొన్నారు.

దహెగాం : ప్రతిఒక్కరు బాడీడు పిల్లలను ప్రభుత్వ బడులలో చేర్పించాలని జిల్లా సెక్టోరల్ అధికారి కటుకం మధుకర్ అన్నారు. గురువారం మండలంలోని ఇట్యాల గ్రామంలో ప్రొ. జయశంకర్ బడిబాట కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో అన్నిరకాల వసతులను ప్రభుత్వం కల్పిస్తుందన్నారు. ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి అందరూ కృషి చేయాలని కోరారు. మొదటి రోజు కార్యక్రమంలో భాగంగా గ్రామ కమిటీతో సమావేశం నిర్వహించినంతరం గ్రామంలో ర్యాలీ చేపట్టి ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో హెచ్ఎం వీర శంకర్ సుధాకర్, స్వయం సహాయక సంఘం సభ్యులు, అంగన్‌వాడీ కార్యకర్తలు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

చింతలమానేపల్లి : బడీడు పిల్లలను బడికి లో చేర్పించాలని జిల్లా పరిషత్ పాఠశాల ప్రధానోపాధ్యాయులు జైరాజ్ కోరారు. గురువారం బడిబాట కార్యక్రమంలో భాగంగా మండల కేంద్రంలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థుల సంఖ్య పెంచడానికి ప్రతి ఒక్కరూ సహరించాలని కోరారు. చదువుతోపాటు, మౌలిక వసతులు పాఠశాలల్లో ప్రభుత్వం కల్పిస్తుందని తెలిపారు. ఇందులో గ్రామపంచాయతీ సిబ్బంది ఆసిఫ్ ఆలీ, ఐకెపి సిబ్బంది, విద్యార్థులున్నారు.



కాగజ్‌నగర్ రూరల్



బెజ్జూర్



కౌటాల



పెంచికల్‌పేట్



దహెగాం



చింతలమానేపల్లి

గాలివాన బీభత్సం



నవతెలంగాణ-బెజ్జూరు

మండలంలోని సోమిని, ఇప్పలగూడ, గొర్రెగూడ, దొడ్డి గూడ తదితర గ్రామాల్లో గురువారం సాయంత్రం గాలివాన బీభత్సం సృష్టించింది. గాలితో పాటు వర్షం కురవడంతో పలు గ్రామాల్లో ఇంటి పైకప్పులు గాలికి ఎగిరిపడ్డాయి. సోమిని, కృష్ణపల్లి గ్రామాల మధ్య గాలికి చెట్లు విరిగిపోవడంతో రాకపోకలకు అంతరాయం కలిగింది. సాయంత్రం ఒకసారి వాతావరణంలో మార్పుల కారణంగా మేఘావృతమై వర్షం కురవడంతో ఒకసారి చల్లబడడంతో ప్రజలు ఎండ వేడిమి నుంచి ఉపశమనం పొందారు.

12న మండల సర్వసభ్య సమావేశం

నవతెలంగాణ-సిర్పూర్(టి)

మండల ప్రజా పరిషత్ సాధారణ సర్వసభ సమావేశాన్ని ఈనెల 12న నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ సత్యనారాయణ ఒక ప్రకటన పేర్కొన్నారు. మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఉదయం 11 గంటలకు ప్రారంభమయ్యే సమావేశానికి ఎంపీటీసీలు, అధికారులు సకాలంలో హాజరు కావాలన్నారు. గత సమావేశంలో తీర్మానించిన అంశాలకు సంబంధించిన ప్రగతి నివేదికలను ముందుగా అందజేయాలని. ఈ సమావేశంలో గతంలో తీసుకున్న తిర్మాణాలు, భవిష్యత్ కార్యాచరణపై చర్చించడం జరుగుతుందన్నారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
మంచిర్యాల
శుక్రవారం | జూన్ 07, 2024 | www.navatelangana.com

రోడ్డు ప్రమాదంలో వృద్ధురాలి మృతి

నవతెలంగాణ-లక్షెట్టిపేట



రోడ్డు ప్రమాదంలో వృద్ధురాలు మృతి చెందిన ఘటన పట్టణంలో జరిగింది. గంపల్లి గ్రామానికి చెందిన చందా మీనమ్మ(76) గురువారం ఆంధ్రబోర్ సమీపంలో ఆటో ఢీకొని మృతి చెందింది. ఎస్ఐ చంద్రకుమార్ తెలిపిన వివరాల ప్రకారం మీనమ్మ బుట్టలు అమ్ముకొని జీవిస్తుంది. లక్షెట్టిపేటకు ఉదయం వచ్చి బుట్టలు అమ్మి తిరిగి ఇంటికి వెళ్తున్న క్రమంలో ఉత్కూర్ చౌరస్తా నుండి కరీంనగర్ నగర్ చౌరస్తా వైపు వెళ్తున్న టీఎస్21టీ1141 నంబర్ గల ఆటో వెనుకాల నుండి ఢీకొట్టడంతో తీవ్ర గాయాలయ్యాయి. మంచిర్యాల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మరణించింది. మృతురాలి కొడుకు చందా శంకరయ్య ఫిర్యాదు మేరకు ఎస్సై-2 రామయ్య కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

సీఎం రేవంత్‌రెడ్డిని కలిసిన ఎంపీ వంశీకృష్ణ

నవతెలంగాణ-జైపూర్



పెద్దపల్లి పార్లమెంట్ సభ్యునిగా గెలుపొందిన గడ్డం వంశీకృష్ణ సీఎం రేవంత్ రెడ్డిని కలిశారు. వంశీకృష్ణతో పాటు ఆయన తండ్రి తండ్రి వివేక్ వెంకటస్వామి, తల్లి సరోజ సీఎంను మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్చం అందించారు. పెద్దపెల్లి పార్లమెంట్ నియోజకవర్గ అభివృద్ధి గురించి చర్చించారు. ఎంపీగా గెలిచిన వంశీకృష్ణను సీఎం రేవంత్ రెడ్డి అభినందనలు తెలిపారు.

బీట్ ఆఫీసర్‌పై దాడి చేసిన యువకుల అరెస్టు

నవతెలంగాణ-జన్నారం

బీట్ ఆఫీసర్‌పై దాడికి పాల్పడిన ముగ్గురు యువకులను పోలీసులు అరెస్టు చేశారు. దీనికి సంబంధించి వివరాలను ఎస్సై రాజవర్ధన్ తెలిపారు. ఈనెల రెండవ తేదీన మండలంలోని తపాలపురం చెక్‌పోస్టు వద్ద విధులు నిర్వహిస్తున్న బీట్ ఆఫీసర్ సాయి కుమార్‌పై దాడి చేసిన ముగ్గురు చేశారన్నారు. తాళ్లపేట ఎఫ్ఆర్ఓ సుష్మారావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు దండెపెల్లి మండలంలోని మేదర్‌పేటకు చెందిన ఆడెపు శ్రావన్ కుమార్, నెల్కి వెంకటాపూర్‌కు చెందిన దొరిశెట్టి శ్రీనివాస్, నరసాపూర్‌కు చెందిన తీగల ఉదయ్‌లుగా గుర్తించి పట్టుకున్నట్లు పేర్కొన్నారు. వీరిపై కేసు నమోదు చేసి బుధవారం అరెస్టు చేశామని తెలిపారు.

కాంట్రాక్ట్ కార్మికుల వేతనాలు చెల్లించాలి



నవతెలంగాణ-నస్పూర్

గనులలో మేషన్ అండ్ చిప్పింగ్‌లో పనిచేస్తున్న కాంట్రాక్ట్ కార్మికుల వేతనాలు చెల్లించాలని సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్(ఏఐటీయూసీ) శ్రీరాంపూర్ బ్రాంచ్ కార్యదర్శి ఎస్కె బాజీ సైదా, సింగరేణి కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ బెల్లంపల్లి రీజియన్ కార్యదర్శి అఫ్రోజ్ ఖాన్ అన్నారు. గురువారం కాంట్రాక్ట్ వర్కర్ల సమస్యలు పరిష్కరించాలని ఎస్ఓ టూ జీఎం పరుషోత్తమ రెడ్డికి వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సింగరేణిలో కాంట్రాక్టు కార్మికుల చాలీచాలని జీతాలతో కాలం వెళ్లదిస్తున్న సమయానికి రాక ఆర్థిక ఇబ్బందులు పడుతున్నారన్నారు. యాజమాన్యం వెంటనే స్పందించి మేషన్ అండ్ చిప్పింగ్ ఈఈ ఎంటర్‌ప్రయిజెస్‌లో పనిచేస్తున్న కాంట్రాక్ట్ కార్మికులకు 3 నెలలుగా పెండింగ్‌లో వేతనాలు ఇచ్చేలా చూడాలని కోరారు. జీతాలు అడిగిన కార్మికులకు నిర్లక్ష్యంగా కాంట్రాక్టర్ సమాధానం చెబుతున్నారని ఆరోపించారు. యాజమాన్యం వెంటనే స్పందించి కార్మికులకు రావాల్సిన 3 నెలల వేతనాలను కాంట్రాక్టర్ వద్ద నుండి ఇప్పించాలని, ఇలాంటి సమస్యలు పునరావృతం కాకుండా సదరు కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో ఆందోళనలు చేపడుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో సింగరేణి కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ శ్రీరాంపూర్ బ్రాంచ్ అధ్యక్షులు దొడ్డిపట్ల రవీందర్, నాయకులు సాయి, శ్రీనివాస్, విజయ్, వెంకటేష్, కృష్ణ ,మల్లేష్, రమేష్, తిరుపతి, మనోజ్, సంతోష్ పాల్గొన్నారు.

పేద కుటుంబానికి నిత్యావసర సరుకులు అందజేత



నవతెలంగాణ-జన్నారం

మండలంలోని కలమడుగు గ్రామంలో నిరుపేద కుటుంబానికి చెందిన వడ్రంగి రాజన్న రెండు రోజుల క్రితం భారీ ఈదురు గాలులకు ఇంటికి పైకప్పు లేచిపోయి సామాగ్రి తడిపోయాయి. విషయం తెలుసుకున్న తెలంగాణ నేతకాని మహర్ విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సాయి ప్రసాద్ నేత బుధవారం వారి ఇంటికెళ్లి కుటుంబానికి 25 కిలోల బియ్యం ఇతర నిత్యావసర సరుకులతో పాటు ఆర్థిక సాయం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నిరుపేద కుటుంబానికి చెందిన రాజన్నను ప్రభుత్వం ఆదుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ స్వదేశ్ రావు, మండల మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ నర్సగౌడ్, బీఆర్ఎస్ మండల ఉపాధ్యక్షులు జంగం సంతోష్, నాయకులు మంతెన వెంకటేష్, రుబెన్, అరుణ్ పాల్గొన్నారు.

సీఐటీయూలో చేరిన ఓబీ కన్వేయన్స్ డ్రైవర్లు

నవతెలంగాణ-రామకృష్ణాపూర్



ఆర్కే ఓసీపీలో పనిచేస్తున్న కన్వేయన్స్ డ్రైవర్లు గురువారం సీఐటీయూలో చేరారు. ఈ చేరికల కార్యక్రమానికి సీఐటీయూ అనుబంధ ఎస్సీకేఎస్(సింగరేణి కాంట్రాక్ట్ కార్మిక సంఘం) రాష్ట్ర అధ్యక్షుడు దూలం శ్రీనివాస్ ముఖ్య అతిథిగా హాజరై డ్రైవర్లకు కండువాలు కప్పి యూనియన్‌లోకి ఆహ్వానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సింగరేణి వ్యాప్తంగా పని చేస్తున్న కాంట్రాక్ట్ కన్వెయన్స్ డ్రైవర్లు అనేక సమస్యలను ఎదుర్కొంటున్నారని తెలిపారు. వాటిని పరిష్కరించడంలో యాజమాన్యం విఫలమైందని పేర్కొన్నారు. సీఎంపీఎఫ్ అమలు విషయంలో సీఐటీయూ ఆధ్వర్యంలో అనేక పోరాటాలు చేస్తూ అధికారులకు సీఎంపీఎఫ్ కమిషనర్‌కు అనేక దఫాలుగా వినతిపత్రాలు ఇచ్చామన్నారు. ఓనర్స్ కార్మికులకు సీఎంపీఎఫ్ అమలు చేయవద్దని హైకోర్టు, సుప్రీంకోర్టును సైతం ఆశ్రయించారని తెలిపారు. కోర్టులు సైతం కార్మికుల పక్షాన తీర్పునివ్వడం శుభ పరిణామమని అన్నారు. సింగరేణి యాజమాన్యం వెంటనే కన్వేయన్స్ డ్రైవర్లందరికీ సీఎంపీఎఫ్ అమలయ్యే విధంగా చొరవ తీసుకోవాలని డిమాండ్ చేశారు. సంవత్సర కాలం నుండి ఓనర్ల బిల్లు నుండి సీఎంపీఎఫ్ కోసం 15శాతం కట్ చేసిన డబ్బులను కార్మికులకు సీఎంపీఎఫ్ నెంబర్ ఇచ్చి డబ్బులను కార్మికుల అకౌంట్లో జమ చేసే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రతినెలా 7వ తేదిలోపు వేతనాలు చెల్లించాలన్నారు. ఓనర్స్ తమ డిమాండ్లను పరిష్కరించాలని 5 నుండి చేస్తున్న సమ్మెపై యాజమాన్యం స్పందించి వెంటనే పరిష్కారించే దిశగా చొరవ చూపాలన్నారు. కార్యక్రమంలో కన్వేయన్స్ డ్రైవర్ మందమర్రి డివిజన్ కమిటీ అధ్యక్షుడు కె.తిరుపతి, కార్యదర్శులు యు.రవి, ఎండి చాంద్ పాషా, కుమార స్వామి, యం.రమేష్, బి.వెంకటేశ్, యండి.రాజ్ మహ్మద్, యండి. సాజీత్, కె.తిరుపతి, ఎ.రాజు, యం.శ్రీధర్ పాల్గొన్నారు.

పదవ తరగతి ఉత్తీర్ణతలో మండలం టాప్


జన్నారం

నవతెలంగాణ-జన్నారం

పదవ తరగతి పరీక్ష ఫలితాలు, ఎన్ఎంఎంఎస్ స్కాలర్షిప్ గురుకుల పాఠశాలలో సీట్లు సాధించడంలో జన్నారం ప్రథమ స్థానంలో ఉందని డీఈఓ యాదయ్య అన్నారు. గురువారం ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట కార్యక్రమంలో భాగంగా మండలంలోని పొన్కల్ గ్రామపంచాయతీ పరిధిలోని పాఠశాలు, కలమడుగు జడ్పీఎస్ఎస్ ప్రభుత్వ పాఠశాలలో ఆయన పాల్గొన్నారు. అనంతరం పాఠశాలల్లోని విద్యార్థులకు పుస్తకాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బడిబాట కార్యక్రమంలో ఎక్కువ మంది పిల్లలు ప్రభుత్వ పాఠశాలల్లో చేరేలా గ్రామస్తులు పిల్లల తల్లిదండ్రులు కృషి చేయాలన్నారు. ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థులకు పుస్తకాలు ,రెండు చేతల దుస్తులు, మధ్యాహ్న భోజనం అందిస్తామన్నారు. అనంతరం ఆయా గ్రామాల్లో బడిబాట ర్యాలీని నిర్వహించారు. కార్యక్రమంలో ఎంఈఓ విజయ్ కుమార్, కలమడుగు జడ్పీఎస్ఎస్ హెచ్ఎం కట్ట రాజమౌళి, ఎంపీడీఓ శశికళ, ఎంపీఓ రమేష్, ఎస్ఎస్‌సీ కోఆర్డినేటర్ చౌదరి, బాలికల పాఠశాల హెచ్ఎం గొల్ల రామన్న, కొండ్రు జనార్ధన్, అంగన్‌వాడీ టీచర్లు, పాఠశాల చైర్మన్లు పాల్గొన్నారు.

మందమర్రి : బడిబాట కార్యక్రమంపై మెప్మా ఆర్పీలకు మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు గురువారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు కలిగే ప్రయోజనాల గురించి తల్లిదండ్రులకు వివరించి వారి పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్చే విధంగా కృషి చేయాలని సూచించారు. ఈ సందర్భంగా ఎంపీపీ ఎస్.విద్యానగర్ పాఠశాల హెచ్ఎం నీలోఫర్‌కు ఏకరూప దుస్తులను అందించారు. కార్యక్రమంలో ఆర్‌పీ సదయ్య, మెప్మా ఇన్‌చార్జి టీఎంసీ పాల్గొన్నారు.

తాండూర్ : బడిబాట కార్యక్రమంలో భాగంగా మండలంలోని పాఠశాలల్లో గురువారం పాఠశాల స్థాయి సమావేశాలు నిర్వహించినట్లు ఎంఈఓ ప్రభాకర్ తెలిపారు. పాఠశాల చైర్మన్, స్వయం సహాయక గ్రూప్ సభ్యులు, ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ కార్యకర్తలతో ర్యాలీలు నిర్వహించి బడిబాట ప్రతిజ్ఞ చేయించారు. బడి ఈడు పిల్లలందరినీ పాఠశాలలో నమోదు చేయించాలని ఎంఈఓ సూచించారు. ప్రతిరోజు పాఠశాల పరిధిలోని గృహాలను సందర్శించి విద్యార్థులను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించేలా కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు, మండల నోడల్ అధికారి ఎస్.మల్లేశం, ప్రాథమిక పాఠశాల తంగళ్ళపల్లి ప్రధానోపాధ్యాయులు మాణిక్ రావు, ఉపాధ్యాయులు, గ్రామపంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

దండేపల్లి : బడిఈడు పిల్లలందరినీ పాఠశాలల్లో చేర్పించాలని దండేపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాల హెచ్ఎం శంకర్ గౌడ్ అన్నారు. గురువారం ప్రొఫెసర్ జయశంకర్ బాడీపాట కార్యక్రమంలో భాగంగా మండల కేంద్రంలో ఉపాధ్యాయులు ఇంటింటికీ తిరిగి ప్రచారం నిర్వహించారు. తమ పిల్లలను పాఠశాలల్లో చేర్పించాలని తల్లిదండ్రులకు సూచించారు. అనంతరం గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. అంగన్‌వాడీ కేంద్రంలో చేరిన పిల్లలకు అక్షరాభ్యాసం చేయించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, సీఆర్‌పీ సురేందర్, అంగన్‌వాడీ టీచర్స్ పాల్గొన్నారు.


మందమర్రి



దండేపల్లి

కాసిపేట గనిపై ఏఐటీయూసీ గేట్ మీటింగ్

నవతెలంగాణ-కాసిపేట



మందమర్రి ఏరియాలోని కాసిపేట 1వ గనిపై ఏఐటీయూసీ ఆధ్వర్యంలో గేట్ మీటింగ్ నిర్వహించారు. 25 మంది కార్మికులు ఏఐటియూసీ యూనియన్‌లో అధ్యక్షులు సీతారామయ్య ఆధ్వర్యంలో చేరగా వారికి కండువా కప్పి ఆహ్వానించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన ఏఐటీయూసీ అధ్యక్షులు వాసిరెడ్డి సీతారామయ్య మాట్లాడుతూ ఏఐటీయూసీకి సింగరేణి గుర్తింపు పత్రం వెంటనే ఇవ్వాలన్నారు. కంపెనీ స్థాయిలో ప్రతి సమావేశాల్లో కార్మికుల సమస్యలను పరిష్కరించాలలన్నారు. నూతన భూగర్భ గనులు ప్రారంభించాలన్నారు. 2023-24 సంవత్సర లాభాల వాటా 35శాతం ఇవ్వాలన్నారు. కాలం చెల్లిన ఎస్డీలను మార్చేసి, త్వరగా కొత్త ఎస్ఏఎల్ యంత్రాలు తేవాలని, ఆపరేటర్లకు ప్రమోషన్ ఇవ్వాలన్నారు. వెయ్యి పోస్టులు భర్తీకి యాజమాన్యంతో మాట్లాడినట్లు వివరించారు. 35 నుండి 40 సంవత్సరాలకు వయసును పొడిగించాలన్నారు. సొంతింటి పథకం కింద ప్రతి కార్మికులకు 250 గుంటల స్థలము, రూ.20 లక్షలు అడ్వాన్స్ యాజమాన్యమే చెల్లించాలన్నారు. సింగరేణికి చెల్లించాల్సిన రూ.29 కోట్లలను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ సెంట్రల్ సెక్రెటరీ ఎండీ అక్బర్ అలీ, బ్రాంచ్ ఇన్‌చార్జి చిప్ప నర్సయ్య, మందమర్రి, బెల్లంపల్లి బ్రాంచ్ కార్యదర్శులు సాలేంద్ర సత్యనారాయణ, దాగం మల్లేష్, బెల్లంపల్లి బ్రాంచ్ వైస్ ప్రెసిడెంట్ బియ్యాల వెంకటస్వామి, బ్రాంచ్ సహాయ కార్యదర్శి దాసరి తిరుపతి గౌడ్, కోశాధికారి ఎస్.నాగేశ్వరరావు, పిట్ కార్యదర్శి మీనుగు లక్ష్మీనారాయణ, అసిస్టెంట్ కార్యదర్శి రాజేందర్ పార్వతి సురేష్, రంజిత్ కుమార్, మురళి, అశోక్, నిఖిల్, లింగయ్య, సంపత్, ఆడెపు రవీందర్, బియ్యాల రాజన్న, శ్రీనివాస్, అటికేటి సందీప్, సురేష్, రఘురాం, జాడి తిరుపతి, ఆవునూరు తిరుపతి పాల్గొన్నారు.

ఘనంగా జాన్సన్ నాయక్ పుట్టినరోజు వేడుకలు



నవతెలంగాణ-జన్నారం

ఖానాపూర్ బీఆర్ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జి భూక్య జాన్సన్ నాయక్ పుట్టినరోజు వేడుకలను పార్టీ నాయకులు జరుపుకున్నారు. బుధవారం మండల కేంద్రంలో శ్రేణులు కేక్ కట్ చేసి మిఠాయిలు పంచుకున్నారు. ఈ సందర్భంగా మండల పార్టీ అధ్యక్షుడు గుర్రం రాజారామ్ రెడ్డి, జడ్పీటీసీ ఎర్ర చంద్రశేఖర్ మాట్లాడుతూ పేదల అభివృద్ధి కోసం కృషి చేసే వ్యక్తి జాన్సన్ నాయక్ అని కొనియాడారు. ప్రతి పేదవానికి కార్యకర్తకు అండగా నిలిచే వ్యక్తి అన్నారు. జాన్సన్ నాయక్ ఇలాంటి పుట్టిన రోజులు మరెన్నో జరుపుకోవాలన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల, జిల్లా నాయకులు, మాజీ సర్పంచులు, ఎంపీటీసీలు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

గైర్హాజరు ఉద్యోగులు విధులకు హాజరవ్వాలి



నవతెలంగాణ-నస్పూర్

గైర్హాజరు ఉద్యోగులు ఇప్పటి నుండైన విధులకు హాజరు కావాలని శ్రీరాంపూర్ ఏరియా జనరల్ మేనేజర్ సంజీవరెడ్డి అన్నారు. గురువారం జీఎం కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాల్‌లో శ్రీరాంపూర్ ఏరియాలోని గైర్హాజరు ఉద్యోగులకు ఫ్యామిలీ కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా జీఎం మాట్లాడుతూ శ్రీరాంపూర్ ఏరియాలో 2021 నుండి 2023 సంవత్సరాలలో ఒక్క మస్టర్ కూడా చేయని ఉద్యోగులు ఇప్పటి నుండి తప్పని సరిగా ప్రతినెల 20 మస్టర్లు చేయాలని, సంస్థలో ఉద్యోగం దొరకడం మీ అందరి అదృష్టమని, ఉద్యోగులందరూ హాజరు శాతాన్ని పెంచుకోవాలని కోరారు. సింగరేణి సంస్థ చాలా సదుపాయాలు అందిస్తుందని, ప్రతి ఒక్కరు దానిని దృష్టిలో ఉంచుకొని విధులకు హాజరు కావాలన్నారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ బ్రాంచ్ సెక్రటరీ బాజీ సైదా, సేవా అధ్యక్షురాలు రాధా కుమారి, సంజీవరెడ్డి, డీజీఎం పర్సనల్ పి.అరవింద రావు, డీవై సీఎంఓ డా. పి రమేష్ బాబు, డీవైపీఎం రాజేష్, సీనియర్ పీఓలు కాంతారావు, గౌస్ పాషా, పాల్ సృజన్, సంతన్, సేవా సెక్రటరీ కొట్టే జ్యోతి పాల్గొన్నారు.

అభివృద్ధి పనులను వేగవంతం చేయాలి

నవతెలంగాణ-ఆసిఫాబాద్

అమ్మ ఆదర్శ పాఠశాలల కమిటీ ఆధ్వర్యంలో జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలలలో చేపట్టిన అభివృద్ధి, మరమ్మత్తు పనులను వేగవంతం చేసి త్వరగా పూర్తి చేసేలా అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని కలెక్టర్ వెంకటేష్ ధోత్రే అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని బజారువాడ అమ్మ ఆదర్శ పాఠశాలలో కొనసాగుతున్న పనులను అదనపు కలెక్టర్ దీపక్ తివారి, ఏపీఓ శ్రీనివాస్‌తో కలిసి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అమ్మ ఆదర్శ పాఠశాలల కమిటీ ఆధ్వర్యంలో ప్రభుత్వ పాఠశాలలో చేపట్టిన పనులను వేగవంతం చేసి పాఠశాలల పున:ప్రారంభంలోగా పూర్తి చేయాలని ఆదేశించారు. ప్రభుత్వ పాఠశాలలలో పూర్తి సౌకర్యాలతో కూడిన నాణ్యమైన విద్య బోధన అందించేందుకు ప్రభుత్వం పాఠశాలల అభివృద్ధి పనులను చేపట్టిందన్నారు. తాగునీరు, విద్యుదీకరణ, మూత్రశాలలు, ఇతర మరమ్మత్తు పనులను త్వరగా పూర్తి చేయాలన్నారు. అనంతరం ఏకరూప దుస్తుల కుట్టు కేంద్రాన్ని సందర్శించి పాఠశాలల ప్రారంభం రోజునే విద్యార్థులకు అందించాలన్నారు.

సీఎంను కలిసిన నియోజకవర్గ ఇన్‌చార్జి

నవతెలంగాణ-ఆసిఫాబాద్

ఆసిఫాబాద్ నియోజకవర్గ ఇన్‌చార్జి శ్యాం నాయక్ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని హైదరాబాద్‌లోని సీఎం క్యాంప్ కార్యాలయంలో కలిశారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలోని పలు ప్రధాన సమస్యలు ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువెళ్లారు. వర్షాకాలం వస్తున్న నేపథ్యంలో గిరిజన ప్రాంతాల్లో కనీస సౌకర్యాలు లేక గిరిజనులు ఇబ్బంది పడుతున్నారని, కనీస మౌలిక వసతులు కల్పించాలని కోరారు. ఇదే సందర్భంలో ముఖ్యమంత్రి స్పందిస్తూ సమస్యలు పరిష్కారం కోసం అవసరమైన చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చినట్లు శ్యామ్‌నాయక్ తెలిపారు. పార్లమెంట్ ఎన్నికల్లో నియోజకవర్గాల్లో మెజార్టీ రావడంపై అభినందించినట్లు పేర్కొన్నారు. ఆయనతో పాటు ఖానాపూర్ మాజీ ఎమ్మెల్యే రేఖా నాయక్ ఉన్నారు.

ఘనంగా ఛత్రపతి పట్టాభిషేక దినోత్సవ వేడుకలు

నవతెలంగాణ-ఆసిఫాబాద్

ఛత్రపతి శివాజీ మహారాజ్ పట్టాభిషేకం దినోత్సవ వేడుకలు జిల్లా కేంద్రంలో ఆరె సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా ఉపాధ్యక్షులు కొలే భిక్కాజి మాట్లాడుతూ నేటి సమాజానికి ఛత్రపతి మహారాజ్ చరిత్రను ప్రతి ఒక్కరు స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు. సమాజంలో ఉన్న వైరుధ్యాలపై నిరంతరం పోరాటం చేసిన గొప్ప వ్యక్తి అని కొనియాడారు. కార్యక్రమంలో ఆరె సంక్షేమ సంఘం డివిజన్ ప్రధాన కార్యదర్శి నాగపురి మారుతి, మండల అధ్యక్షుడు గేడేన్కార్ సంతోష్ కుమార్, సంఘం నాయకులు దిలీప్ సాయి, బీసీ సంఘం నాయకులు ఆవిడపు ప్రణయ్, జక్కయ్య, బాలేష్, నాగరాజు, శివాజీ, అభిమానులు గడ్డల ప్రణయ్, దేవరావు రాజశేఖర్ పాల్గొన్నారు.

ఎంపీసీ గ్రూప్‌ను సద్వినియోగం చేసుకోండి

నవతెలంగాణ-దహెగాం

మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నూతనంగా మంజూరైన ఎంపీసీ గ్రూప్‌ను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ అమరేందర్ ఒక ప్రకటన లో పేర్కొన్నారు. గత విద్య సంవత్సరం వరకు కేవలం బైపీసీ, సీఈసీ మాత్రమే ఉండగా మండల విద్యార్థుల కోరిక మేరకు ఎంపీసీ గ్రూప్‌ను ప్రభుత్వం మంజూరు చేసిందన్నరు. ఇంటర్మీడియట్ విద్యార్థులు ఎంపీసీ గ్రూప్‌లో చేరేందుకు కళాశాలలో దరఖాస్తు చేసుకోవచ్చున్నారు.

ఉష్ణోగ్రత తగ్గింది..ఉక్కపోత పెరిగింది

నవతెలంగాణ-ఆసిఫాబాద్

జిల్లాలో వారం రోజులుగా ఎండలు ఎక్కువగా పెరిగిన నేపథ్యంలో గురువారం జిల్లా కేంద్రంలో కాసేపు కురిసిన వర్షంతో ఉష్ణోగ్రత తగ్గింది. ఇదే సమయంలో ఉక్కపోత పెరిగింది. వాతావరణంలో ఉన్న తేమతో విపరీతమైన ఉక్కపోతతో జిల్లా ప్రజలు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. మరో రెండు రోజుల్లో రుతుపవనాలు రాష్ట్రం మొత్తం వ్యాపిస్తాయని వాతావరణ శాఖ సూచన చేయడంతో వర్షాలపై ఆశలు పెంచుకున్నారు. ఏది ఏమైనా గురువారం వరకు విపరీతమైన వేడితో జిల్లా ప్రజలు ఇబ్బందులు పడ్డారు.

డైట్‌సెట్ ప్రవేశ పరీక్ష దరఖాస్తుకు 30 వరకు గడువు

నవతెలంగాణ-ఆసిఫాబాద్

డైట్ ప్రవేశాలకు జూలై 10న నిర్వహించే పరీక్షకు దరఖాస్తుకు ఈనెల 30 తేది వరకు గడువు ఉందని, ఆన్‌లైన్‌లో విద్యార్థులు దరఖాస్తులు చేసుకోవాలని జిల్లా విద్యాధికారి అశోక్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఇతర వివరాల కోసం డైట్‌సెట్.సీడీఎస్‌సీ.తెలంగాణ.జీఓవీ.ఇన్ వెబ్ సైట్‌ను సంప్రదించాలన్నారు.

రేపు గుళికల మందు పంపిణీ

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ప్రతి ఏటా మదిరిగానే ఈ సంవత్సరం కూడా వైద్య ఆయుర్వేదిక్ రిసెర్చ్ సెంటర్ ఆధ్వర్యంలో మృగశిర కార్తెను పురస్కరించుకుని గుళికల మందును పంపిణీ చేస్తున్నట్టు ప్రముఖ ఆయుర్వేద వైద్య నిపుణుడు డా.యువరాజ్ వైద్య తెలిపారు. గురువారం తన క్లినక్‌లో గుళికల పంపిణీ వివరాలు మీడియా సమావేశంలో తెలియజేశారు. ఉబ్బసం, ఆయాసం, అస్తమా వ్యాధులతో బాధపడుతున్న వారిని రోగం నుంచి విముక్తులను చేసే లక్ష్యంతో గత 25 ఎండ్లుగా మృగశిర కార్తె రోజున ఆయుర్వేద గుళికలను ఉచితంగా పంపిణీ చేస్తున్నామన్నారు. ఈ నెల 8న పట్టణ శివారులోని సీసీఐ క్రాస్‌రోడ్డు వద్ద గల వైద్య ఆయుర్వేదిక్ రిసెర్చ్ సెంటర్లో ఉదయం 9 గంటల 30 నిమిషాల నుంచి సాయంత్రం 5 గంటల వరకు మందు పంపిణీ ఉంటుందని తెలిపారు. నిర్దేశిత సమయంలో నేరుగా వచ్చి ఆయుర్వేద గుళికల మందును పొందాలని సూచించారు.

చాందా(టి)లో పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

నవతెలంగాణ-ఆదిలాబాద్‌రూరల్



మండలంలోని చాందా(టి)లో 2004-05 పదవ తరగతి బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. 20 ఏండ్ల తర్వాత విద్యార్థుళు ఒకచోట కలుసుకొని మధుర జ్ఞాపకాలను నెమరేసుకున్నారు. ఆత్మీయ సమ్మేళనానికి కృషి చేసిన దత్తు, సంతోష్, మధుకర్, దేవన్న, శ్రీకాంత్, అశోక్, రవీందర్, రాజు, ప్రకాష్, స్వామి, ప్రీతి, సౌజన్య, శ్యామల, ప్రమీల, రత్నమాల, సురేఖను పలువురు అభినందించారు. ఈ సందర్భంగా తమకు విద్యాబుద్ధులు నేర్పిన ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు.

జీపీ కార్మికులకు పెండింగ్ వేతనాలు చెల్లించాలి



నవతెలంగాణ-రెబ్బెన

గ్రామ పంచాయతీ కార్మికులకు పెండింగులో ఉన్న వేతనాలు చెల్లించాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి బోగే ఉపేందర్ అన్నారు. గురువారం ఏఐటీయూసీ అనుబంధ సంఘం గ్రామ పంచాయతీ వర్కర్స్ యూనియన్ కార్మికులతో కలిసి ఎంపీడీఓ కార్యాలయంలో సూపరింటెండెంట్ వాసుకు వినతిపత్రం అందించారు. వేతనాలు లేక కార్మికులు పడుతున్న ఇబ్బందులను వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో గ్రామపంచాయతీలో పని చేస్తున్న కార్మికులకు పెండింగ్‌లో ఉన్న వేతనాలు వెంటనే చెల్లించాలన్నారు. ఆరు నెలల నుంచి వేతనాలు లేక కార్మికులు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. మండలంలో సంవత్సర కాలం నుంచి కార్మికులకు వేతనాలు చెల్లించకపోవడంతో కుటుంబ పోషణ భారంగా మరిందన్నారు. అధికారులకు విన్నవించిన పట్టించుకోవడం లేదని ఆరోపించారు. రాష్ట్రంలో 2023 జులై, ఆగస్టులో కార్మికుల వేతన సమస్యల పరిష్కారం కోసం 34 రోజులపాటు నిరవధిక సమ్మె చేయడం జరిగిందని, రాష్ట్ర ప్రభుత్వం కార్మిక సంఘాలన్నింటిని చర్చలకు పిలిచి సమస్యలు పరిష్కరిస్తామని హామీ ఇవ్వడంతో సమ్మె విరమించామన్నారు. ఇప్పటికి సమస్య అలానే ఉందన్నారు. కార్మికులకు జీఓ నెంబర్ 60 ప్రకారం వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో మండల గ్రామపంచాయతీ వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు గోగర్ల శంకర్, కార్యదర్శి దుర్గం వెంకటేష్, కార్మికులు అన్నాజీ, శంకర్, సంతోష్, రమేష్, వెంకటేష్, కిరణ్ పాల్గొన్నారు.

డీసీసీ అధ్యక్షునికి శ్రేణుల సన్మానం

నవతెలంగాణ-ఆసిఫాబాద్

పార్లమెంటు ఎన్నికల్లో నియోజకవర్గ పరిధిలో 27 వేలకు పైగా మెజారిటీ కాంగ్రెస్ సాధించిన నేపథ్యంలో జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు విశ్వప్రసాద్‌ను సన్మానించారు. గురువారం ఆయన నివాసంలో ఎంపీ అభ్యర్థి ఆత్రం సుగుణతో కలిసి కాంగ్రెస్ శ్రేణులు ఘనంగా సత్కారించారు. ఈ సందర్భంగా విశ్వ ప్రసాద్ మాట్లాడుతూ కార్యకర్తలంతా కలిసికట్టుగా పనిచేసి నియోజకవర్గంలో కాంగ్రెస్ అభ్యర్థికి మెజారిటీ వచ్చేలా చేశారన్నారు. ఇదే స్ఫూర్తితో స్థానిక సంస్థల ఎన్నికల వరకు పని చేయాలని సూచించారు. స్థానిక సంస్థల్లో 90శాతం పైగా మెజారిటీ సాధించేలా చూడాలన్నారు. ప్రభుత్వంతో సంప్రదిస్తూ నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తానని తెలిపారు. కార్యక్రమంలో ఎన్ఎస్‌యూఐ జిల్లా అధ్యక్షుడు ఎండి ఆసిఫ్, పార్టీ మండల అధ్యక్షుడు మసాడి చరణ్, జిల్లా యూత్ అధ్యక్షుడు గుండ శ్యామ్, మైనారిటీ జిల్లా నాయకులు అహ్మద్ బిన్ అబ్దుల్లా, మాజీ కోఆప్షన్ మెంబెర్ అమానుల్లా పర్వేజ్, మజీ మార్కెట్ కమిటీ చైర్మన్ మల్లేష్, నాయకులు తన్వీర్ అహ్మద్, అసద్, సలీం, రఫీక్, మొహమ్మద్ షఫీ, శ్రీను, ఇస్మాయిల్ పాల్గొన్నారు.

సమస్యను సత్వరమే పరిష్కరిస్తాం

నవతెలంగాణ-నార్నూర్

మలంగి తండాలో నీరు, కరెంటు సమస్యను సత్వరమే పరిష్కరిస్తామని ఎంపీడీఓ జవహర్‌లాల్ అన్నారు. గురువారం డీఈ శ్రీనివాస్‌తో కలిసి గ్రామాన్ని సందర్శించారు. ఎస్ఈతో మాట్లాడి కరెంటు సమస్యలను పరిష్కరిస్తామని, అక్కడక్కడ లీకేజీ ఉండడంతో ట్యాంకులో నీరు రావడం లేదని తెలిపారు. వారి వెంట డీటీ అమృత్‌లాల్, ఆర్‌డబ్ల్యుఎస్ ఏఈ శుభాని, ఆర్ఐ కవిత, ఈసీ సురేందర్, కార్యదర్శి స్నేహ, దివ్యశ్రీ ఫౌండేషన్ చైర్మన్ ప్రవీణ్ నాయక్, జాదవ్ గణేష్ ఉన్నారు.

గాయపడ్డ కాంగ్రెస్ నాయకుడికి పరామర్శ

నవతెలంగాణ-నిర్మల్

ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ దిలావర్‌పూర్ మండలం కంజర్ గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకుడు నిమ్మ సాయిని గురువారం డీసీసీ అధ్యక్షులు శ్రీహరిరావు పరామర్శించారు. జిల్లా కేంద్రంలోని ప్రయివేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ఆయనను డీసీసీ అధ్యక్షులు పరామర్శించి ప్రమాదానికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. ఆరోగ్య పరిస్థితి గురించి డాక్టర్ దేవేందర్‌రెడ్డితో మాట్లాడి మెరుగైన వైద్యం అందించాలని సూచించారు. పరామర్శించిన వారిలో నాయకులు ఎంబడి రాకేష్, డా.ఈసవేని మనోజ్ యాదవ్, కోడే విజయ్, కోడె శ్రీనివాస్, ఆర్గుల రమణ, శ్రీహరి, బొడ్డు సాయి, నిమ్మ గణేష్ ఉన్నారు.

చేపల వేటకు వెళ్లి యువకుడి మృతి

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

విద్యుద్ఘాతానికి గురై యువకుడు మృతి చెందిన సంఘటన ఆదిలాబాద్ పట్టణంలో గురువారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణంలోని చిలుకూరి లక్ష్మీనగర్ కాలనీకి చెందిన సయ్యద్ జాఫర్(35) కాలనీ సమీపంలోని చెరువులో చేపల వేటకు వెళ్లాడు. అయితే చెరువు వద్ద విద్యుత్ తీగలు తగలడంతో విద్యుద్ఘాతానికి గురయ్యాడు. వెంటనే స్థానికులు రిమ్స్ ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్టు వైద్యులు పేర్కొన్నారు.

నేడు మండల సర్వసభ్య సమావేశం

నవతెలంగాణ-ఉట్నూర్

పట్టణంలోని ఎంపీడీఓ కార్యాలయంలో 7న శుక్రవారం ఉదయం 10:30 నిమిషాలకు మండల సర్వసభ్య సమావేశం నిర్వహించినట్టు ఎంపీపీ పంద్ర జైవంత్‌రావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆయాశాఖల అధికారులు, ఎంపీటీసీలు హాజరుకావాలని కోరారు.

ఉరేసుకొని మహిళ ఆత్మహత్య

నవతెలంగాణ-సారంగాపూర్



ఉరేసుకొని మహిళ ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలోని ధని గ్రామంలో గురువారం చోటు చేసుకుంది. ఎస్సై చంద్రమోహన్ తెలిపిన వివరాల ప్రకారం.. ధని గ్రామానికి చెందిన కొప్పుల లక్ష్మీ(51) కొంత కాలంగా అనారోగ్యానికి గురై చికిత్స చేయించుకుంది. అయిన నయం కాకపోవడంతో మనస్థాపానికి గురై గురువారం ఇంటిలో ఎవరు లేని సమయంలో ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. మృతురాలి కుమారుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై తెలిపారు.

పార్కింగ్‌కు స్థలమేదీ..?

- ఇబ్బందులు పడుతున్న వాహనదారులు

నవతెలంగాణ-వాంకిడి

మండల కేంద్రంలో పార్కింగ్ స్థలం లేక వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. మండల కేంద్రానికి వివిధ గ్రామాల నుంచి నిత్యం ప్రజలు వివిధ పనుల నిమిత్తం వస్తుంటారు. గురువారం బజారుతో పాటు సోమవారం వ్యాపార సముదాయాలు ఎదుట వాహనాలను పార్క్ చేస్తుంటారు. దీంతో ట్రాఫిక్ సమ్యలు పెరిగింది. కిరాణ దుకాణాల్లో, మెకానిక్ దుకాణాలు, ఎలక్ట్రిక్ దుకాణాలు, బేకరీలు, టీ స్టాళ్లు ఇలా ప్రజలకు అవసరమైన దుకాణాలను రోడ్డు వెంట ఉండడంతో వాహనాలను రోడ్డుపైనే నిలిపుతున్నారు. ప్రత్యేకంగా స్థలం లేకపోవడంతో దుకాణాల ముందు రోడ్డుపైనే పార్కింగ్ చేస్తున్నారు. దీంతో తరుచుగా ట్రాఫిక్ సమస్య నెలకొంటుంది.

> **వాహనదారులు సహకరించాలి**
>
> **ఎస్ఐ సాగర్**
>
> ట్రాఫిక్ సమస్య లేకుండా చర్యలు తీసుకుంటాం. వాహనదారులు, దుకాణదారులు రోడ్డుపై వాహనాలు నిలపకుండా సహకరించాలి. రోడ్డుభద్రత నిబంధనలకు విరుద్ధంగా వాహనాలను నిలిపితే చర్యలు తీసుకుంటాం.

స్థలం లేక ఇబ్బందులు..

ప్రధాన మార్కెట్ ఏరియాలో వాహనాలు పార్కింగ్ చేసేందుకు ప్రత్యేకంగా స్థలం లేకపోవడంతో ఇబ్బందులు తప్పడం లేదు. మండల కేంద్రం గుండా నాలుగు వరుసల రహదారి 363 నిర్మాణం జరుగుతుండడంతో వాహనాల పార్కింగ్ పెద్ద సమస్యగా మారింది. రహదారిని నిర్మించేందుకు స్థలం సేకరణ సమయంలో రోడ్డు నిర్మాణానికి అవసరమైన స్థలాన్ని మాత్రం సేకరించారు. దీంతో ప్రస్తుతం వాహనాలు నిలిపేందుకు స్థలం లేకుండా పోయింది. సర్వీసు రోడ్డు గుండా సైడ్‌డ్రేన్లకు ఆనుకొని వివిధ రకాల దుకాణాలు ఉండడంతో అవసరాల నిమిత్తం సరుకులు, వస్తువులు కొనుగోలు చేసే ప్రజలు వాహనాలను రోడ్డుపైనే నిలపాల్సివస్తుంది. కొందరు దుకాణ యజమానులు, చిరువ్యాపారులకు దుకాణాల ముందున్న సైడ్‌డ్రేన్లపై స్థలాలు అద్దెకిస్తూ ఆక్రమణలకు పాల్పడుతున్నట్టు తెలుస్తోంది. కూరగాయలు, ఇతర వస్తువులు అమ్ముకొనే వారికి ప్రత్యేకంగా స్థలం కేటాయించకపోవడంలో పంచాయతీ అధికారులు విఫలమవుతుండగా చిరువ్యాపారస్తులు నాలాలపై కూర్చొని అద్దె చెల్లిస్తూ వ్యాపారాన్ని కొనసాగిస్తున్నారు. దీంతో ట్రాఫిక్ సమస్య కూడా పెరుగుతుంది. అధికారులు చర్యలు తీసుకోవాలని వాహనదారులు కోరుతున్నారు.



వాహనాలు నిలపడంతో తీవ్ర ఇబ్బందులు...

మండల కేంద్రానికి వచ్చే వాహనదారులు వాహనాలను రోడ్డుపైనే నిలపడంతో తరుచుగా ఈ-చలాన్లు వేస్తున్నారు. కొన్ని నెలల క్రితం పోలీసులు ఒకరు లేక ఇద్దరు కానిస్టేబుళ్లు మార్కెట్ ఏరియాలో ఉంటూ వాహనాలు నిలపకుండా ట్రాఫిక్ జామ్ కాకుండా చూసుకొనేవారు. ఇప్పుడు మాత్రం ఆన్‌లైన్ ద్వారా ఈ-చలాన్లు చేస్తున్నారు. దీంతో మార్కెట్ రద్దీగా ఉండే సమయంలో వాహనదారులకు కష్టలు తప్పడం లేదు. కొన్ని సందర్భాల్లో రోడ్డు గుండా బస్సులు, లారీలు వంటి పెద్ద వాహనాలు వస్తే అండర్‌పాస్ వద్ద వాహనాలు ఎటూ కదలలేని పరిస్థితి ఉంటుంది. వాహనదారులకు తిరిగి ఇంటికెళ్లేలోపే ఈ-చలాన్ల రూపంలో జరిమానాలు పడుతుండడం, రహదారి గుండా దుకాణాల సముదాయాలు ముందు నో పార్కింగ్ బోర్డులు ఏర్పాటు చేయాలని కోరుతున్నారు. ఇప్పటికైనా ట్రాఫిక్ సమస్య ఏర్పడకుండా వాహనదారులకు ట్రాఫిక్ స్థలం కేటాయించాలని వాహనదారులు అంటున్నారు.

నగేష్ కాదు..మోడీతో పోటీలో ఓడిపోయాను

- కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి ఆత్రం సుగుణ

నవతెలంగాణ-ఆసిఫాబాద్

పార్లమెంటు ఎన్నికల ఫలితాల్లో బీజేపీ అభ్యర్థి గోడం నగేష్‌తో కాకుండా మోడీతో పోటీలో తాను ఓడిపోయానని కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి ఆత్రం సుగుణ అన్నారు. ఓటమి తర్వాత మొదటిసారి జిల్లా కేంద్రానికి వచ్చిన ఆమె కాంగ్రెస్ కమిటీ జిల్లా అధ్యక్షుడు విశ్వప్రసాద్ అధ్యక్షతన జిల్లా కేంద్రంలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నగేష్‌కు ఓటు బ్యాంకు లేదని, తాను మోడీ మానియాతో పడ్డ ఓటు బ్యాంకుతో ఓడిపోయానన్నారు. మతాల పేరు మీద రాజకీయం చేయడం సరైనది కాదన్నారు. తనకు రాజకీయం తెలియనప్పటికీ ఆదిలాబాద్ పార్లమెంట్ నియోజకవర్గంలో 4,77,000పై చిలుకు ఓట్లు రావడంలో కార్యకర్తల పాత్ర ఎంతో ఉందన్నారు. తాను గెలవాలని కృషి చేసిన ప్రతి కార్యకర్తకు పాదాభివందనం చేస్తున్నానంటూ భావోద్వేగానికి గురయ్యారు. ఆదిలాబాద్ పార్లమెంట్ పరిధిలో ఆసిఫాబాద్ నియోజకవర్గంలో పెద్ద ఎత్తున తనకు మెజార్టీ రావడం జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు కార్యకర్తలా పని చేశారని నియోజకవర్గ ప్రజలను ఎప్పటికీ మరిచిపోనన్నారు. రాష్ట్ర ప్రభుత్వ పథకాలతో ఆసిఫాబాద్ ప్రాంత అభివృద్ధికి కృషి చేస్తానని తెలిపారు. ఓటమిపాలైనప్పటికీ కార్యకర్తల శ్రమతో ఆసిఫాబాద్‌లో గెలిచానన్నారు. నియోజకవర్గంలోని కార్యకర్తలు తనను ఎంతో ఆదరించారని భవిష్యత్తులో తాను కూడా పిల్లలను తల్లి ఎలా చూసుకుంటుందో కార్యకర్తలందరిని



అలాగే చూసుకుంటానని తెలిపారు. ఇచ్చిన హామీలు నెరవేరుస్తానని ప్రతిజ్ఞ చేశారు. అంతకు ముందు జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు విశ్వప్రసాద్ మాట్లాడుతూ కాంగ్రెస్ ఆర్థికంగా బలంగా ఉన్నవారికి ఎన్నడూ కూడా టికెట్లు ఇవ్వలేదని దీనికి నిదర్శనమే ఎమ్మెల్యే ఎన్నికల్లో బొజ్జు పోటీ చేయడం అన్నారు. అదే పంథాలో పార్లమెంట్ ఎన్నికల్లో కూడా ఒక సాధారణ జీవితం గడిపి ఉపాధ్యాయురాలికి టికెట్ ఇచ్చామని, గెలుపు కోసం అహర్నిశలు కృషి చేసిన లక్ష్యం సాధించలేకపోయామన్నారు. తమకు ఒడిదుడుకులు సహజమేనని వాటన్నింటినీ ఎదుర్కొంటూ ప్రజలకు సేవ చేస్తామన్నారు. అతి తక్కువ సమయంలో ఆదిలాబాద్ పార్లమెంట్ పరిధిలో కాంగ్రెస్ తన సత్తా చాటిందన్నారు. కార్యకర్తలెవరూ అధైర్య పడకూడదని అసెంబ్లీలో ఇచ్చిన మెజారిటీతో అభివృద్ధి పనులు చేస్తూ ముందుకు సాగుదామన్నారు. అనంతరం అసెంబ్లీ పార్లమెంట్ ఎన్నికల్లో నియోజకవర్గంలో అత్యధిక మెజారిటీ సాధించిన ఆసిఫాబాద్ మండలం ఎల్లారం పోలింగ్ బూత్ నెంబర్ 201 కార్యకర్త హనుమంతు, దత్తు, వాంకిడి మండల కేంద్రంలోని బూత్ నెంబర్ 257 కు చెందిన అనిల్, అదే మండలం బెండర బూత్ నెంబర్ 233కు చెందిన పాండులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు మసాడే చరణ్, అనిల్ గౌడ్, అబ్దుల్లా, మల్లేష్, ఎండి ఆసిఫ్, గుండా శ్యామ్, దుర్గం రవీందర్, విశ్వనాథ్, సోమన్న, మారుతిపటేల్, దేవాజి పాల్గొన్నారు.

11 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టివేత

నవతెలంగాణ-ఆదిలాబాద్‌రూరల్

11 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని అక్రమంగా ఆటోలో తరలిస్తున్నట్టు వచ్చిన సమాచారం మేరకు గురువారం ఎస్సై ముజాహిద్ దాడులు నిర్వహించి, మండలంలోని లాండసాంగి గ్రామంలో ఆటోను పట్టుకున్నారు. అందులో ఉన్న 11 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. బియ్యం విలువ దాదాపు రూ.15వేలు ఉంటుంది. మూడు ఆటోలను సీజ్ చేసి, షౌకత్, అఫ్రోజ్, అస్లాం వీరి ముగ్గురిపై కేసు నమోదు చేసినట్టు ఎస్సై తెలిపారు.

నర్సరీని సందర్శించిన అదనపు డీఆర్డీఓ



నవతెలంగాణ-తలమడుగు

మండలంలోని సుంకిడి నర్సరీని అదనపు డీఆర్డీఓ కుటుంబరావు గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన సంబంధిత శాఖల అధికారులతో మాట్లాడుతూ ఫీల్డ్ అసిస్టెంట్ అశన్న, పంచాయతీ కార్యదర్శి సుజాతకు పలు సూచనలు, తీసుకోవాల్సిన జాగ్రతలపై వివరించారు. రాబోయే కాలంలో మొక్కలను నాటు ప్రదేశాలను ఇప్పటి నుండే గుర్తించాలన్నారు. షిఫ్టింగ్ గ్రేడింగ్ మొక్కలను సమూహము నుంచి తీసివేసి మరో మొక్కలను పెంచాలన్నారు. ఎత్తుగా పెరిగిన మొక్కల వేర్లు భూమి వరకు నాటు కోవడం వలన వాటిని ఓ ప్రక్కకు అని వేరును మెల్లగాతీసివేసి మరోచోట నాటేందుకు ప్రయత్నం చేయాలన్నారు. 2024 టార్గెట్‌లో కమ్యూనిటీ, అవెన్యూ ప్లాంటేషన్‌లో కానుగలను, పండ్ల మొక్కలను నాటాలని అన్నారు. ఆయన వెంట పంచాయతీ కార్యదర్శి, ఫీల్డ్ అసిస్టెంట్ ఉన్నారు.

బడీడు పిల్లలను బడిలో చేర్పించాలి

నవతెలంగాణ-బోథ్

బడీడు పిల్లలను బడిలో చేర్పించాలని కుచులాపూర్ జెడ్పీ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు విజయ్ కుమార్ అన్నారు. గురువారం కుచులాపూర్ గ్రామంలో బడిబాట కార్యక్రమాన్ని నిర్వహించారు. అందులో భాగంగా విద్యార్థులు ర్యాలీ నిర్వహించి, అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయుడు పి.విజయకుమార్ మాట్లాడుతూ గ్రామాల్లో డ్రాప్‌అవుట్‌గా విద్యార్థులు లేకుండా ప్రతి ఒక్కరిని బడిలో చేర్పించే విధంగా తల్లిదండ్రులను కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్ కళావతి, గ్రామస్తులు ప్రేమలత, రజిత, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆదిలాబాద్ రూరల్ : మావల మండల కేంద్రంతో పాటు బట్టిసావర్‌గాం గ్రామంలో గురువారం బడిబాట కార్యక్రమంలో తల్లిదండ్రులకు అవగాహన కల్పించామని ఎంపీడీఓ శంకర్ తెలిపారు. ప్రయివేట్ కంటే దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన వసతులు ఉన్నాయని అన్నారు. ప్రతి ఒక్క తల్లిదండ్రులు ఆలోచించి వారి పిల్లలను భవిష్యత్తు కోసం ప్రభుత్వ బడిలో చేర్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఐకేపీ ఏపీఎం, వీఓ, వీఓఏ పంచాయతీ కార్యదర్శి, విద్యార్థులు ఉన్నారు. అదేవిధంగా వాఘాపూర్‌లో నిర్వహించిన బడిబాట కార్యక్రమంలో జెడ్పీ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఆర్. నారాయణ, ప్రాథమిక పాఠశాల ప్రధాన ఉపాధ్యాయులు పవార్ సాహెబ్‌రావ్, అమ్మ ఆదర్శ కమిటి చైర్మన్ అనప లక్ష్మి, సీనియర్ ఉపాధ్యాయులు, నాగేందర్, రమేష్ బాబు, ఉపాధ్యాయులు ప్రతాప్, కయ్యూమ్, గ్రామస్తులు భూపెల్లి శ్రీధర్, మర్సకోల సుభాష్, మర్సకొల గౌతమ్, విద్యార్థిని, విద్యార్థులు గ్రామస్తులు పాల్గొన్నారు.



ఇచ్చోడ

లోకేశ్వరం : ప్రతీ ఒక్కరూ తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్పించాలని, ఇక్కడే విద్యార్థులకు మెరుగైన విద్య అందుతుందని ఎంఈఓ చంద్రకాంత్ అన్నారు. గురువారం మండల కేంద్రంతో పాటు ఆయా గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాల ఆధ్వర్యంలో బడిబాట కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు, ఉపాధ్యాయులు ర్యాలీ నిర్వహించి, విద్యార్థుల తల్లిదండ్రులకు ప్రభుత్వ పాఠశాలలో అందిస్తున్న విద్య గురించి అవగాహన కల్పించారు. అన్ని వసతులు ఉన్న ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ సోలమన్ రాజ్, ప్రధానోపాధ్యాయులు, అంగన్‌వాడీ ఉపాధ్యాయురాలు పాల్గొన్నారు.

ఇచ్చోడ : ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు విద్యతో వారి తల్లిదండ్రులకు ఆర్థిక భరోసా కలుగుతుందని ప్రధానోపాధ్యాయులు రమేష్ అన్నారు. గురువారం మండలంలోని బోరిగామ గ్రామంలో బడిబాట కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు రమేష్ మాట్లాడుతూ పాఠశాలలో చదువుతూ మధ్యలో బడి మానేసిన పిల్లలను వారి తల్లిదండ్రులు ప్రత్యేక చొరవ తీసుకొని ప్రభుత్వ బడిలో చేర్పించాలని కోరారు. ప్రతి ఇంటింటికి వెళ్లి విద్యపై తల్లిదండ్రులకు, పిల్లలకు అవగాహన కల్పించేందుకు నిరంతరం కృషి చేస్తున్నట్టు తెలిపారు. గ్రామ కమిటీ సభ్యులు, గ్రామస్తులు బడిబాట కార్యక్రమంలో పాల్గొనాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు శ్యాంసుందర్, అంగన్‌వాడీ టీచర్, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

తలమడుగు : మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆధ్వర్యంలో గురువారం ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట కార్యక్రమాన్ని విజయ వంతం చేయడంలో భాగంగా సమావేశం నిర్వహించినట్లు ప్రధానోపాధ్యాయుడు వెంకట్‌రావు తెలిపారు. పిల్లలందరినీ స్థానిక బడిలో చేర్పించాలని అన్నారు. ఆవాస ప్రాంతంల్లోని అందరూ



బోథ్

విద్యార్థులు పాఠశాలలో చేర్చి కొనసాగేలా చూడాలని అన్నారు. 5వ తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థులను 6వ తరగతిలో ఉన్నత పాఠశాలలో చేర్పించాలని అన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో కల్పించిన సౌకర్యాలను వివరించడం ద్వారా ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థుల సంఖ్యను పెంచడం ద్వారా పేదవారి ఆర్థిక భారాన్ని తగ్గించడం సంబంధించి నిర్ణయాలు తీసుకోవడం జరిగిందని అన్నారు. తర్వాత గ్రామ వీధుల గుండా విద్యార్థులు ర్యాలీలో పాల్గొని నినాదాలు చేస్తూ ర్యాలీ నిర్వహించారు. మండల కూడలిలో విద్యార్థులచే మానవహారం ఏర్పాటు చేసి బడిబాట ప్రతిజ్ఞ చేయించారు. ర్యాలీలో ఎంపీడీఓ శేఖర్, తహసీల్దార్ రాజ్‌మోహన్, ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు రమణ, ఎంపీఓ వినోద్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ విజయ, పంచాయతీ కార్యదర్శి అశోక్, ఉపాధ్యాయులు, సీసీలు, వీఏఓలు, ఎస్‌హెచ్‌జి గ్రూప్ సభ్యులు, వీఓ ఛైర్మెన్లు, గ్రామ, మండల సమాఖ్య ఛైర్మెన్, సభ్యులు, అంగన్‌వాడీ టీచర్స్, విద్యార్థులు పాల్గొన్నారు.

నేరడిగొండ : మండలంలోని లక్కంపూర్ చించోలి ఇలా పలు గ్రామాల్లో అంగన్‌వాడీ ఆధ్వర్యంలో బడిబాట కార్యక్రమం నిర్వహించారు. అనంతరం వారు మాట్లాడుతూ బడీడు పిల్లలను బాల కార్మికులను గుర్తించి, బడిలో చేర్పించాలని అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ మంజుల, అంగన్‌వాడీ టీచర్ శ్రీలత, లక్ష్మి, లఖంపూర్ ఆశ్రమ పాఠశాల ఉపాధ్యాయులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

లోకేశ్వరం : మండలంలోని రాజుర గ్రామంలో గురువారం అంగన్‌వాడీ బడిబాట కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో ఇంటింటికీ వెళ్లి చిన్నారుల తల్లిదండ్రులకు ప్రభుత్వం పౌష్టికాహారం, గుడ్లు, నాణ్యమైన భోజనం అందిస్తుందని వివరించారు. అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులకు అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నామని, తప్పకుండా అంగన్‌వాడీ కేంద్రానికి పంపించాలని కోరారు. అంగన్‌వాడీ టీచర్లు పద్మ, శోభ, లలిత పాల్గొన్నారు.